తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : దర్శం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
శనివారం
9 ఆగస్టు 2025
సంపుటి : 355
సంచిక : 2
పేజీలు : 8
వెల రూ.5.00

Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna

## అమెరికాకు షాకిచ్చిన భారత్..

### ఆయుధ కొనుగోలు ఒప్పందాలకు తాత్కాలికంగా బ్రేక్



- 25 శాతం సుంకాలను విధించడంతో ప్రతిగా ఈ నిర్ణయం
- భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వాషింగ్టన్ పర్యటన రద్దు

న్యూఢిల్లీ,
అగ్రరాజ్యం అమెరికా కు భారత్ షాకిచ్చింది. అమెరికాతో కీలకమైన ఆయుధ కొనుగోలు ఒప్పందాలకు భారత్ తాత్కాలికంగా బ్రేకులు వేసింది. భారత ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనంగా 25 శాతం సుంకాలను విధించడంతో ప్రతిగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రాయిటర్స్ ఓ కథనం ప్రచురించింది.తాజా పరిణామాలతో ఇరుదేశాల మధ్య సంబంధాలు గత కొన్ని దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. భారత్ తాజాగా తీసుకున్న

-మిగతా 2 లో

## మాటల్లేవు..మాట్లాడుకోవడాలు లేవు

### భారత్‌పై సుంకాల విషయంలో ట్రంప్ మంకుపట్టు





వాషింగ్టన్,
భారీ సుంకాలతో భారత్‌పై అన్యాయంగా కాలుదువ్వుతున్న ట్రంప్ తాజాగా మరో బాంబు పేల్చారు. భారత్‌తో వాణిజ్య చర్చలు ఉండవని స్పష్టం చేశారు. దీంతో, భారత్- అమెరికా సంబంధాలు మునుపెన్నడూ చూడని స్థాయిలో పతనమై ఆందోళన రేకెత్తిస్తున్నాయి. భారత్‌పై సుంకాల విధింపు అనంతరం చర్చలు కొనసాగుతాయా? అన్న మీడియా ప్రశ్నకు ట్రంప్ ఉండవని

-మిగతా 2 లో




## బీజేపీకి తొత్తుగా ఎన్నికల సంఘం

### ఓట్ల దొంగతనానికి ఈసీ సహకారం

- తన ఆరోపణలపై ఈసీ ఎందుకు మౌనం
- వెంటనే ప్రజలకు నిజాలు వెల్లడించాలి
- బెంగళూరు సమావేశంలో రాహుల్ తీవ్ర విమర్శలు

బెంగళూరు,
ఎన్నికల సంఘం తన బాధ్యతల్ని విస్మరిస్తోందని, రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన సంస్థ ఇప్పుడు బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఓట్లను దొంగిలించేందుకు ఎన్నికల సంఘం సహకరిస్తోందని ఆయన విమర్శించారు. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం మరోసారి ఎన్నికల సంఘాన్ని తీవ్రంగా విమర్శించారు.ప్రజాస్వామ్యాన్ని

-మిగతా 2 లో



## దేశంలో టాప్-10 సురక్షిత నగరాలు ఇవే.

- హైదరాబాద్‌కు దక్కని చోటు..!

న్యూఢిల్లీ,
నంబియో సేఫ్టీ ఇండెక్స్ ప్రపంచవ్యాప్తం గా ఉన్న సురక్షిత నగరాలు, దేశాలు-2025 జాబితాను విడుదల చేసింది. అందులో భారత్ కు చెందిన 10 నగరాలు కూడా ఉన్నాయి. భారతదేశానికి చెందిన సురక్షిత నగరాల్లో కర్ణాటక లోని మంగళూరు తొలి స్థానంలో నిలిచింది. దేశ రాజధాని ఢిల్లీ అట్టడుగున ఉంది.గుజరాత్‌లోని వడోదర, అహ్మదాబాద్, సూరత్ నగరాలకు కూడా టాప్-10 ఈ జాబితాలో స్థానం దక్కింది. కానీ హైదరాబాద్ నగరానికి టాప్-10 జాబితాలో చోటు దక్కకపోవడం గమనార్హం. ఇక ప్రపంచంలోని అత్యంత సురక్షితమైన

-మిగతా 2 లో




## అప్రమత్తంగా ఉండాలి

- భారీవర్షాలతో నగరంలో ఇక్కట్లు
- అప్రమత్తంగా ఉండాలి సిఎం ఆదేశం
- పొంగిప్రవహిస్తున్న మూసీ నది
- వాగులో కొట్టుకు పోతున్న కారును కాపాడిన స్థానికులు

హైదరాబాద్,
హైదరాబాద్ నగరంలో వర్షాలతో తలెత్తుతున్న ఇబ్బందులు, వరద సమస్యకు శాశ్వత పరిష్కారంపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడా ప్రాణ నష్టం లేకుండా చూడాలన్నారు. సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి,సెక్రటరీ ఇలంబర్తి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, ఈవీ నర్సింహా రెడ్డి, జేఎండీ పి.గౌతమి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

-మిగతా 2 లో



## కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం

- ప్రతి పథకం వెనకా కమీషన్ల బాగోతం
- ఏ పనిచేసినా దోచుకేవడమే లక్ష్యం
- బీఆర్ఎస్ ఎదురు దాడితో తప్పించుకునే ఎత్తుగడ
- ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో మంత్రి పొంగులేటి విమర్శలు

హనుమకొండ,
గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కమీషన్ల కోసమే కట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. వారు ఏ పని చేసినా కమీషన్ల కోసమే చేశారని అన్నారు. తెలంగాణను అడ్డంగా దోచుకున్నారని మండిపడ్డారు. ప్రతి పథకంలో కమీషన్ కోసమే నాటి ప్రభుత్వం పని చేసిందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. హన్మకొండ జిల్లాకేంద్రం బాలసముద్రంలో

-మిగతా 3 లో

## దౌత్య సంబంధాలను పటిష్టం చేసుకుందాం

- పుతిన్‌తో ఫోన్ సంభాషణలో మోడీ..!



న్యూఢిల్లీ,
రష్యాతో చమురు ఒప్పందం.. దౌత్య సంబంధాల పటిష్టంపై ప్రధాని నరేంద్ర మోడీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌సుంకాల మోతకు భయపడేది లేదంటున్న మోడీ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ ను రష్యాకు పంపించారు. శుక్రవారం ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని ఫోన్‌లో మాట్లాడారు. రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యం విషయంలో భారత్ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన ఎక్స్ ద్వారా తెలియజేశారు.ఈ ఏడాదిలో స్వదేశంలో భారత్, రష్యా 23వ వార్షిక సమావేశం

-మిగతా 2 లో




## చౌకబారు విమర్శలపై క్షమాపణలు చెప్పాలి

- బండి సంజయ్‌కు కేటీఆర్ హెచ్చరిక

హైదరాబాద్,
ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల్లో నిజం ఉంటే నిరూపించాలని సంజయ్‌కు సవాల్ విసిరారు. లేదంటే 48 గంటల్లో వ్యాఖ్యలు ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే లీగల్ నోటీ-సులు పంపుతానని హెచ్చరించారు.ఇంటెలిజెన్స్ విభాగంపై ఆయనకు కనీస పరిజ్ఞానం లేదని, కేంద్ర హోంశాఖ

-మిగతా 2 లో

## ఫోన్ ట్యాపింగ్‌లో వేలకోట్ల వల



- వ్యాపార, సినీ, రాజకీయ ప్రముఖుల బ్లాక్‌మెయిల్
- ఎన్నికల్లో పట్టుబడ్డ వందలకోట్లు కేసీఆర్ ఖాతాలోకి
- భార్యాభర్తల ఫోన్లుకూడా ట్యాప్ చేసిన దుర్మార్గులు
- అత్యధికంగా నా ఫోన్ ట్యాప్ జరిగింది
- ప్రభాకర్ రావు, రాధాకిషన్ రావులకు ఉరిశిక్ష వేసినా తక్కువే
- సిబిఐ విచాణతోనే దొంగలను పట్టుకునే ఛాన్స్
- సిట్ విచారణ అనంతరం మీడియాతో బండి సంజయ్

హైదరాబాద్,
ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ మరోమారు డిమాండ్ చేశారు. ఇందులో లోతుగా విచారణ చేసి నిజాలు నిగ్గు తేల్చాల్సి ఉందన్నారు. హైదరాబాద్‌లోని దిల్‌కుషా అతిథి గృహంలో సిట్ విచారణకు హాజరైన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని ఆరోపించారు. అందుకే కేసీఆర్ కుటుంబానికి సీఎం క్లీన్ చిట్ ఇచ్చారని

-మిగతా 2 లో

## కాళేశ్వరం నివేదిక ఇవ్వండి

### సీఎస్‌ను కోరిన హరీష్ రావు



హైదరాబాద్,
కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన పూర్తి నివేదికను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు కోరారు. శుక్రవారం ఆయన సచివాలయానికి వెళ్లి సీఎస్ రామకృష్ణరావును కలిశారు. జస్టిస్ ఘోష్ ఇచ్చిన 665 పేజీల నివేదిక ప్రతులను ఇవ్వాలని కోరుతూ.. కేసీఆర్, హరీష్ రావు పేరుతో వేర్వేరు వినతి పత్రాలను అందజేశారు. అనంతరం వినతిపత్రాలు ఇచ్చినట్లు- రశీదులు తీసుకున్నారు.

-మిగతా 2 లో

తరంగాలు జాతీయ దిన పత్రిక RNI. TELTEL / 2022 / 83463 Tharangalu Daily News Paper

# బీజేపీకి తొత్తుగా ఎన్నికల సంఘం

(మొదటి తరువాయి)

రక్షించాలంటే ప్రజలు చైతన్యంతో ఉండాలని, ఈ ఎన్నికల్లో న్యాయం నిలవాలంటే అధికార యంత్రాంగం కక్ష సాధింపులు చేయకుండా వ్యవహరించాలంటూ రాహుల్ గాంధీ హితవు పలికారు. అంతేకాదు, కర్ణాటకతో పాటు- ఇతర రాష్ట్రాల్లో కూడా ఇలాంటి మోసాలు జరుగుతున్నాయని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలో మీరు రాజ్యాంగాన్ని తాకాలని అనుకుంటే, ఒకసారి ఆలోచించాలని సూచించారు. ఈ విషయంలో మీరు ఎంత తెలివిగా దాక్కున్నా, మేము మిమ్మల్ని పట్టుకుంటామన్నారు. ఇందుకు కొంచెం సమయం పట్టొ-చ్చు, కానీ తప్పకుండా పట్టుకుంటామని రాహుల్ గాంధీ ఎన్నికల సంఘానికి వార్నింగ్ ఇచ్చారు. ఎన్నికలు దేశ గుండె చప్పుడని, అలాంటి క్రమంలో ఒక్క ఓటు- దొంగిలించబడినా అది జనాభా గొంతును నొక్కేయడమేనని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో ఇలాంటి ఘటనలు జరిగితే, అది రాష్ట్ర ప్రజలకు మాత్రమే కాదు, దేశ వ్యాప్తంగా డెమాక్రసీకి సవాల్‌గా మారుతుందన్నారు. నిజంగానే ఎన్నికల సంఘం ఎవరి పక్షం వైపు ఉందని ప్రశ్నలు పలువురిలో వచ్చే అవకాశం ఉంది. ఇది ఒక్క కర్ణాటక సమస్య మాత్రమే కాదు. దేశవ్యాప్తంగా ఎన్నికల సమగ్రత గురించి చర్చకు దారితీస్తుంది. కానీ, రాహుల్ గాంధీ ఇక్కడితో ఆగలేదు. ఆయన రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దాన్ని కాపాడటానికి తాము ఎంతకైనా సిద్ధమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘానికి రాహుల్ గాంధీ ఐదు ప్రశ్నలు సంధించారు. డిజిటల్ ఓటర్ల జాబితాను ఎందుకు దాచి పెడుతున్నారు?. సీసీ పుటేజీని ఎందుకుఎవరి ఆదేశాలతో తొలగిస్తున్నారు? నకిలీ ఓట్ల నమోదును ఎందుకు అడ్డుకోలేకపోతున్నారు. విపక్షాలను ఈసీ ఎందుకు భయపెడుతోంది. భాజపా ఏజెంట్‌గా ఈసీ మారిపోయిందా?అంటూ ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భారత ప్రజాస్వామ్యం ఎంతో అమూల్యమైనదని ఈ సందర్భంగా రాహుల్ అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానంలోని మహదేవపుర అసెంబ్లీ స్థానంలో లక్ష కంటే ఎక్కువ దొంగ ఓట్లున్నాయి. ఎన్నికల సంఘం బిజెపితో కుమ్మక్కయ్యిందని రాహుల్ ఆరోపించారు. 40 మందితో కూడిన బృందం ఆరు నెలలపాటు- నిర్వహించిన విశ్లేషణలో వేలాది నకిలీ ఎంట్రీలు, నకిలీ చిరునామాలు చెల్లని ఫొటోలు, అనుమానాస్పద ఫారం 6 దరఖాస్తులు బయట పడ్డాయని రాహుల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే, కెసి వేణుగోపాల్, సిఎం సిద్దరామయ్య, డిప్యూటి సిఎం డికె శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే రాహుల్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. తను చేసే వాదనలను ధృవీకరిస్తూ అధికారిక ప్రకటనపై సంతకం చేయాలి లేదా దేశానికి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఎన్నికల సంఘం సవాల్ విసిరింది. రాహుల్ గాంధీ దగ్గర రెండు ఆప్షన్‌లే ఉన్నాయి. ఒకటి ఆయన చేసే ఆరోపణలు నిజమనుకుంటే.. డిక్లరేషన్‌పై సంతకం చేయడం లేదా.. ఇసిఐపై అసంబద్ధ ఆరోపణలు చేసినందుకు దేశానికి క్షమాపణలు చెప్పడం అని ఎన్నిక సంఘం వర్గాలు తెలిపాయి.

# అప్రమత్తంగా ఉండాలి

(మొదటి తరువాయి)

ఇదిలావుంటే హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. వలిగొండ మండలం సంగెం సమీపంలోని భీమలింగం వద్ద లోలెవల్ బ్రిడ్జి పై నుంచి మూసీ ప్రవాహం కొనసాగుతోంది. వరద ప్రవాహం ప్రమాదకర స్థాయిలో ఉండటంతో వంతనపై ఎవరూ ప్రయాణించకుండా పోలీసులు బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు- చేశారు. దీంతో సంగెం పరిసర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భువనగిరి నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. బీబీనగర్ మండలం రుద్రవెల్లి వద్ద బ్రిడ్జి కింద నుంచి మూసీ ప్రవహిస్తోంది. రంగారెడ్డి, హైదరాబాద్. యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురవడంతో మూసీ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. చౌటుప్పల్ మండలంలో ఈదుల వాగు పొంగి ప్రవహించడంతో కారు కొట్టుకుపోయింది. స్థానికులు గమనించి ఏడుగురిని స్థానికులు కాపాడారు. కారు ఈదుల వాగు నుంచి వెళ్తుండగా ఒక్కసారిగా వరదలో కొట్టుకుపోయింది. స్థానికులు తాడు వేసి ఏడుగురిని బయటకు లాగారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. యాదాద్రి భువనగిరి జిల్లా సంగం భీమలింగం దగ్గర మూసీ లెవెల్ వంతెన పైనుంచి ప్రవహిస్తుంది. మూసీ నది వంతెనపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు. హిమాయత్ సాగర్ రిజర్వాయర్ నీటి మట్టం పూర్తిస్థాయికి పెరగడంతో నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని అధికారులు విడుదల చేశారు. దీంతో మూసీ ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో పరీవాహక ప్రజలకు అధికారుల హెచ్చరికలు జారీ చేశారు. హుస్సేన్ సాగర్ కూడా పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరింది.

# ఫోన్ ట్యాపింగ్‌లో వేలకోట్ల వల

(మొదటి తరువాయి)

విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సిట్‌కు అధికారాలు లేవని, విచారణతో కాలయాపన తప్ప ఇంకేం జరగదని అన్నారు. గతంలో భారత రాష్ట్ర సమితి దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోందని దుయ్యబట్టారు. సిబిఐ విచారణకు ఎందుకు వెనకాడుతున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వంలో అత్యధికంగా నా ఫోన్ కాల్స్‌నే ట్యాప్ చేశారు. నా కుటుంబ సభ్యులు, పని మనుషుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. భార్యాభర్తల ఫోన్లూ ట్యాప్ చేసి విన్నారు. నా వద్ద ఉన్న ఆధారాలు, సమాచారం అధికారులకు ఇచ్చాను. వాస్తవానికి మావోయిస్టులకు సంబంధించిన ఫోన్లు ట్యాప్ చేయాలి. కానీ, ఆ జాబితాలో మా పేర్లు పెట్టి ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మొదటిసారి వాంగ్మూలం ఇచ్చింది నేనే. కేసీఆర్ ప్రభుత్వం విచ్చలవిడిగా ఫోన్లు ట్యాప్ చేసింది. కేసీఆర్ కుమార్తె, అల్లుడి ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. గత ప్రభుత్వంలో సాధారణ ఫోన్ కాల్స్ మాట్లాడేందుకు భయపడి వాట్సప్ కాల్స్ మాట్లాడేవాళ్లు. అప్పటి భారత రాష్ట్ర సమితి మంత్రులు, ఎమ్మెల్యేల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని బండి అన్నారు. కేసీఆర్ కుమార్తె, అల్లుడి ఫోన్లు ట్యాప్ చేశారు. వారినీ విచారణకు పిలవాలి. ఎస్ఐబీని సొంత అవసరాలకు అడ్డాగా కేటీఆర్ మార్చారు.నాయకులు, లాయర్లు, వ్యాపారులు, సినీ నటులు,ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. టీ-ఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసు విచారిస్తున్న హైకోర్టు జడ్జి ఫోన్ కూడా ట్యాప్ చేశారు. ఫోన్ల ట్యాపింగ్ ద్వారా అనేక లావాదేవీలకు సంబంధించి లబ్ధి పొందారు. ప్రభాకర్‌రావు, రాధా కిషన్‌రావు బాగోతం చెబుతుంటే నాకే సిగ్గనిపించింది. వారిద్దర్నీ సమాజం క్షమించదు. ఇద్దరికీ ఉరిశిక్ష వేస్తే ఒకేసారి చనిపోతారు.. క్షణక్షణం బాధపడాలి. మా కార్యకర్తలను, ఇతర పార్టీ నాయకులను క్షోభకు గురి చేశారు. ఇద్దరు నిందితులను కాపాడే ప్రయత్నం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోంది. వ్యాపారుల లావాదేవీలు తెలుసుకొని కేటీఆర్ బ్లాక్‌మెయిలింగ్ చేశారని బండి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్లు దోచుకున్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి వద్ద రూ.7 కోట్లు- పట్టుకున్నారు. ఆ డబ్బు ఏమైందో తెలియదు. చాలామంది నాయకుల వద్ద రూ.వందల కోట్లు- సీజ్ చేసి పట్టుకున్నారు. పట్టుబడిన డబ్బులను కేసీఆర్, కేటీఆర్‌కు ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు పంపారు. రూ.20 కోట్లు- దొరికితే.. కేసీఆర్, కేటీఆర్ ఫోన్ చేశాక రూ.2 కోట్లు- అవుతాయి. రూ. వేల కోట్లు- అక్రమాలు జరిగితే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకోదా? ఈడీకి లేఖ రాస్తే విచారణ జరుపుతుంది. సిట్ అధికారులు నిజయితీ పరులు, వారిపై మాకు అనుమానం లేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపైనే మా అనుమానం అంతా. ఫోన్లు ట్యాప్ చేసినట్లు- ఆధారాలున్నా ఎంతకాలం గడుపుతారు. కమిషన్లు వేసి కాలయాపన చేస్తారు. నివేదికలు ఇచ్చినా చర్యలు లేవు. ఏడాది గడిచినా ఒక్క నాయకుడిని అరెస్టు చేయలేదని బండి సంజయ్ అన్నారు. తన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి సిట్ అధికారులు అందించిన వివరాలు చూసి తాను షాక్ అయినట్లు- మంత్రి బండి సంజయ్ తెలిపారు. తన ఫోన్, తన కుటుంబ సభ్యులతోపాటు- తన ఓఎస్డీ, వ్యక్తిగత సిబ్బంది ఫోన్ ట్యాప్ అయినట్లు- చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్ అవుతున్నట్లు- తాను గుర్తించానని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తన ఫోన్లు ఎక్కువ సార్లు ట్యాప్ చేశారని పేర్కొన్నారు. మావోయిస్టుల జాబితాలో తమ పేర్లు పెట్టి ట్యాప్ చేశారని మండిపడ్డారు. పార్టీ కార్యకర్తల నుంచి రాష్ట్ర స్థాయి నాయకులతో తాను మాట్లాడిన అన్ని కాల్స్ ట్యాప్ చేశారని వివరించారు. టీ-బీజేపీ చీఫ్‌గా ఉన్న సమయంలో తన చుట్టూ నిఘా పెట్టారని విమర్శించారు. వావివరసలు లేకుండా ఫోన్లు ట్యాప్ చేశారంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ ఫోన్ల ట్యాపింగ్ వెనుక బీఆర్ఎస చీఫ్ కేసీఆర్ పాత్ర ఉందని కుండ బద్దలు కొట్టారు. కేసీఆర్ పాలనలో సామాన్యులు సైతం ఫోన్లు మాట్లాడ లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో భార్యాభర్తల ఫోన్ సంభాషణలూ కూడా విన్నారంటూ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలకంగా వ్యవహరించిన ప్రభాకర్ రావు, రాధాకిషన్ రావులకు ఉరిశిక్ష విధించాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ నిందితులను రేవంత్ ప్రభుత్వం కాపాడుతోందని ఆరోపించారు. వ్యాపారస్తుల ఫోన్లు ట్యాప్ చేసి బ్లాక్‌మెయిల్ చేశారన్నారు.

# కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం

(మొదటి తరువాయి)

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను ఆపేందుకు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కుట్రచేస్తున్నాయని విమర్శించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ చూసి, బీఆర్ఎస్ నేతలను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. అయినా కూడా బీఆర్ఎస్ నేతలు నిస్సిగ్గుగా తమపై ఎదురుదాడి చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదవాళ్లకు సక్రమంగా ఇల్లు ఇస్తే ఇవాళ ఇల్లు అడిగేవారు కాదని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ చూసి, బీఆర్ఎస్ నేతలను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటు-న్నారని చెప్పారు. అయినా కూడా బీఆర్ఎస్ నేతలు నిస్సిగ్గుగా తమపై ఎదురుదాడి చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదవాళ్లకు సక్రమంగా ఇల్లు ఇస్తే ఇవాళ ఇల్లు అడిగేవారు కాదని స్పష్టం చేశారు. కులం, మతం, పార్టీలతో సంబంధం లేకుండా జిల్లా కేంద్రంలో 592 మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేసినట్లు స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం వచ్చిన 18 నెలలుగా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా దూసుకుపోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారిణి రహిమున్నీసాబేగానికి తొలి పట్టా అందించినట్లు- మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏ పార్టీ కార్యకర్త అని కూడా చూడకుండా ఎంపిక చేసినట్లు చెప్పారు. 'పార్టీలకు అతీతంగా పేదవాడైతే చాలు.. ఇళ్లు ఇవ్వాలని అధికారులకు చెప్పాం. పేదల ముఖంలో నవ్వు చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్లను కొందరికి మాత్రమే ఇచ్చింది. పదేళ్ల పాటు- ఎవరికీ రేషన్ కార్డులు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదటి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. 6.50 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చాం. రైతుభరోసా కింద రైతుల ఖాతాల్లో 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు- జమ చేశాం. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం వేల కోట్ల కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. రూ.లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు మూడేళ్లకే కూలింది. నిర్మాణంలో జరిగిన అక్రమాలను విచారణ కమిషన్ బయటపెట్టింది. బీసీలకు రిజర్వేషన్లను పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బిల్లులను కేంద్రంలోని భాజపా ఆమోదించలేదు. బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న భాజపాకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పొంగులేటి తెలిపారు.

## అమెరికాకు షాకిచ్చిన భారత్..

(మొదటి తరువాయి)

అనూహ్య నిర్ణయంతో సుమారు 3.6 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.30 వేల కోట్లు) విలువైన రక్షణ ఒప్పందాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇందులో భారత సైన్యం కోసం స్ట్రైకర్ యుద్ధ వాహనాలు, జావెలిన్ యాంటీ-ట్యాంక్ క్షిపణులతోపాటు, నౌకాదళం కోసం ఆరు బోయింగ్ పీ-8 I గూఢచార విమానాల కొనుగోలుకు సంబంధించిన ఒప్పందాలు కూడా ఉన్నాయి.ఈ ఒప్పందాలను ఖరారు చేసేందుకు భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్వరలో వాషింగ్టన్‌లో పర్యటించాల్సి ఉండగా తాజా నిర్ణయంతో ఆ పర్యటన రద్దయినట్టు సమాచారం. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ ఉక్రెయిన్‌తో యుద్ధానికి భారత్ ఆర్థికంగా పరోక్షంగా సహకరిస్తోందని ఆగస్టు 6న డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. దాన్ని కారణంగా చూపుతూ భారత ఎగుమతులపై అదనంగా 25 శాతం సుంకాన్ని విధించారు. దాంతో మొత్తం సుంకాలు 50 శాతానికి చేరాయి.అయితే ట్రంప్ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఐరోపా దేశాలు కూడా తమ ప్రయోజనాల కోసం రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తున్నాయని, తమను మాత్రమే అన్యాయంగా లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించింది. అమెరికా గనుక రష్యాలా సమాన ధరకు చమురును సరఫరా చేస్తే, రష్యా నుంచి దిగుమతులు తగ్గించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని భారత్ తెలిపింది. ట్రంప్ బెదిరింపు ధోరణి, దేశంలో పెరుగుతున్న అమెరికా వ్యతిరేక జాతీయవాదం కారణంగా ప్రధాని మోదీకి ఈ విషయంలో రాజకీయంగా ముందుకు వెళ్లడం కష్టంగా మారిందని, అందుకే తాజా నిర్ణయం తీసుకున్నారని నిపుణులు విశ్లేషిస్తున్నారు.అయితే ప్రస్తుతానికి ఇరుదేశాల మధ్య రక్షణ భాగస్వామ్యం, నిఘా సమాచార మార్పిడి, సంయుక్త సైనిక విన్యాసాలు యథావిధిగా కొనసాగుతున్నాయని భారత అధికారులు తెలిపారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా ఉన్న భారత్.. ప్రధానంగా రష్యాపై ఆధారపడినా ఇటీవలి కాలంలో ఫ్రాన్స్, ఇజ్రాయెల్, అమెరికా నుంచి కొనుగోళ్లను పెంచింది.

## మాటల్లేవు..మాట్లాడుకోవడాలు లేవు

(మొదటి తరువాయి)

తెలిపారు. 'విషయం కొలిక్కి వచ్చేంత వరకూ చర్చలు ఉండవు' అని స్పష్టం చేశారు. అంతకుముందు కూడా భారత్‌పై ట్రంప్ రెచ్చి పోయారు. రష్యాతో వాణిజ్యం నెరపే దేశాలపై మరిన్ని సుంకాలు ఉంటాయని హెచ్చరించారు. ఇతర దేశాలూ రష్యాతో వాణిజ్యం జరుపుతుండగా భారత్‌పైనే అక్కసు ఎందుకని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ట్రంప్ ఈ మేరకు సమాధానం ఇచ్చారు. భారతీయ ఉత్పత్తులపై అమెరికా ఇప్పటికే 25 శాతం సుంకం విధిస్తోంది. అదనంగా మరో 25 శాతం సుంకం విధిస్తూ ట్రంప్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. కొత్త సుంకాలు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి. దీంతో, భారత్‌పై మొత్తం సుంకం 50 శాతానికి చేరుకుంది. అమెరికా చర్యలను భారత్ ఖండించింది. సుంకాల విధింపు అన్యాయం, నిర్హేతుకర, చట్టపరంగా సమర్థనీయం కాదని తేల్చి చెప్పింది. జాతీయ ప్రయోజనాల పరిరక్షణకు తాము అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ విషయంలో మా వైఖరిని ముందే స్పష్టం చేశాం. మా దిగుమతులన్నీ మార్కెట్ పరిస్థితులు, 1.4 బిలియన్‌ల భారతీయులకు ఇంధన భద్రత అందించడంపై ఆధారపడి ఉంటాయి' అని విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. అమెరికా సుంకాలపై ప్రధాని మోదీ కూడా ఘాటుగా స్పందించారు. గురువారం ఎమ్ఎస్ స్వామినాథన్ సెంటెనరీ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో ప్రసంగించిన ప్రధాని.. దేశ ప్రయోజనాల కోసం తాను వ్యక్తిగతంగా ఎంతటి మూల్యం చెల్లించుకునేందుకైనా సిద్ధమేనని అన్నారు. ప్రభుత్వానికి దేశ ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. రైతులు, మత్స్యకారులు, డెయిరీ రంగం విషయంలో భారత్ రాజీ పడదని స్పష్టం చేశారు.అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను కూడా భారత్ ఎండగట్టింది. రష్యా చమురును కొనుగోలు చేస్తున్న చైనా, టర్కీపై సుంకాలు ఎందుకు విధించట్లేదని ప్రశ్నించింది. ఇక చైనా ఉత్పత్తులపై గతంలో ప్రకటించిన 145 శాతం సుంకాలను అమెరికా ఇప్పటికీ అమలు చేయని విషయాన్ని కూడా భారత్ ప్రస్తావించింది.

## దేశంలో టాప్-10 సురక్షిత నగరాలు ఇవే.

(మొదటి తరువాయి)

దేశాల జాబితాలో భారత్ 67వ స్థానంలో నిలిచింది. ఈ ర్యాంకింగ్స్‌లో భారత్ 55.8 స్కోర్‌ను సాధించింది. దేశంలో టాప్-10 నగరాలు వరుసగా మంగళూరు, వడోదర, అహ్మదాబాద్, సూరత్, జైపూర్, నవీ ముంబై, తిరువనంతపురం, చెన్నై, పుణె, చండీగఢ్ ఉన్నాయి

## దౌత్య సంబంధాలను పటిష్టం చేసుకుందాం

(మొదటి తరువాయి)

నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పిన మోడీ.. ఉక్రెయిన్ యుద్ధం పురోగతి విషయమై రష్యా అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. 'స్నేహితుడు పుతిన్‌తో సంభాషణ సమగ్రంగా, ఉపయుక్తంగా సాగింది. ఉక్రెయిన్ యుద్ధం తాజా అప్‌డేట్స్ విషయంలో ఆయనకు ఫోన్‌లోనే ధన్యవాదాలు తెలియజేశాను. భారత్, రష్యాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై కూడా ఇద్దరం చర్చించాం.అంతేకాదు రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే విషయంలో కట్టుబడి ఉన్నామని పుతిన్‌తో చెప్పాను. ఈ ఏడాది చివర్లో పుతిన్‌ను భారత్‌కు ఆహ్వానించనున్నాను' అని మోడీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధంపై మరోసారి భారత్ తటస్థ వైఖరిని మోడీ స్పష్టం చేశారు. ఇరు దేశాధినేతలు చర్చించుకొని.. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

## చౌకబారు విమర్శలపై క్షమాపణలు చెప్పాలి

(మొదటి తరువాయి)

సహాయమంత్రిగా పని చేస్తున్నప్పటికీ.. ఆయనకు ఆ మాత్రం పరిజ్ఞానం లేకపోవడం విచారకరమని అన్నారు. ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ.. ఇంటెలిజెన్స్ విభాగం ఎలా పని చేస్తుందో సంజయ్ అర్థం చేసుకోలేరు. నిర్లక్ష్యంతో ఆయన చేసిన ప్రకటనలు హద్దు మీరాయి. చౌకబారు ఆరోపణలతో ఆయన మరింత దిగజారారు. రాజకీయ ఉనికి కోసం రోడ్లపై చౌకబారు నాటకాన్ని ఎంచుకున్నారని విమర్శించారు.

## కాళేశ్వరం నివేదిక ఇవ్వండి

(మొదటి తరువాయి)

హరీశ్‌రావు విజ్ఞప్తిని పరిశీలించి చెబుతామని సీఎస్ చెప్పినట్లు- సమాచారం. భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు హరీష్ రావు వెంట ఉన్నారు.

# సంపాదకీయం

## ట్రంపరితనంను ఎదురించాల్సిందే !

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హద్దుమీరి ప్రవర్తిస్తున్న తీరు మరోమారు ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఏ దేశం ఎవరితో దోస్తానా చేయాలో..ఎవరితో వాణిజ్యం చేయాలో అన్న ఆంక్షలు విధించే హక్కు ట్రంప్‌కు ఎక్కడిదని ప్రశ్నించాలి. ఈ విషయంలో మోడీ దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టాలి. ట్రంప్ ఆంక్షలను అంగీకరించేది లేదని గట్టిగానే చెప్పాలి. చర్చలు జరిపేది లేదంటున్న ట్రంప్‌తో మనం కూడా అంతే మొండి వైఖరితో ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో చెప్పగలగాలి. ఒకవైపు మనపై వాణిజ్య ఆంక్షలు విధిస్తూ..మరోవైపు పాక్‌ను దువ్వుతున్న తీరు అమెరికా ద్వంద్వ నీతిని తెలియ చేస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా విధించిన అదనపు సుంకాలు తీవ్ర దుమారం రేపుతున్న వేళ ట్రంప్ ఏ మాత్రం తగ్గేది లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో రెండు దేశాల మధ్య ఓ రకంగా విభేదాలు పొడసూపి నట్లుగానే భావించాలి. ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు భారత్‌కు పరీక్షగా మారాయి. ఈక్రమంలో మోడీ కూడా మనదేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటూనే ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను తమపై విధించడంతో భారత్ దీటుగా స్పందించింది. తమ దేశంలోని రైతులు, మత్స్యకారులు, పాల ఉత్పత్తుల రంగంలోని వారి ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసింది. అవసరమైతే ఆ భారాన్ని తామే భరిస్తామని వెల్లడించింది. మరోవైపు భారత్‌పై మరిన్ని ఆంక్షలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇక ఆయన విధించిన సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. దీనివల్ల అమెరికాలో కొన్నింటి ధరలు పెరగనున్నాయి. అయితే, అమెరికా అదనపు సుంకాల వల్ల రెండు దేశాల మధ్య తలెత్తిన వివాదం తాత్కాలికమేనని, త్వరలోనే సమసిపోతుందని ప్రవాస భారతీయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. చర్చలు ఫలించి త్వరలో ఒప్పందం కుదరనుందనే ఆశాభావం వ్యక్తం చేశాయి. 50 లక్షల మంది ప్రవాస భారతీయులు అమెరికా అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు. భారతీయ ఉత్పత్తులపై 50శాతం సుంకాలను వేయడాన్ని ఇండియన్–అమెరికన్ల నేత, బైడెన్ మాజీ సలహాదారు అజయ్ భుటోరియా ఖండించారు. 'అమెరికాలో తక్కువ ధరలకు లభించే 50శాతం జనరిక్ మందులను భారత్ సరఫరా చేస్తోంది. ఈ సుంకాలు వాటి ధరలను పెంచుతాయి. దీనివల్ల అమెరికాలోని కుటుంబాలు, సీనియర్ సిటిజన్లు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడతారు. మసాలా దినుసులు, పప్పులు, దీపావళి దుస్తుల ధరలు పెరుగుతాయని పేర్కొన్నారు. దుస్తులు, పాదరక్షల ధరలు 37శాతం దాకా పెరగవచ్చని అభిప్రాయపడ్డారు. ఇది ఎలా ఉన్నా మనం కూడా తగ్గేదేలా లేదన్నట్లుగా వ్యవహ రించాలి. కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ ఇదే విషయాన్ని గుర్తుచేశారు.. ట్రంప్ విధించిన అదనపు సుంకాలపై ప్రధాని మోదీ గట్టిగా సమాధానమిచ్చారు. తమ రైతుల ప్రయోజనాల విషయంలో ఎప్పటికీ రాజీ పడబోమని, దానికి ఎంత మూల్యమైనా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలే మాకు అత్యంత ముఖ్యం. రైతులు, మత్స్యకారులు, డెయిరీ ఉత్పత్తిదారుల ప్రయోజనాల విషయంలో భారత్ ఎప్పటికీ రాజీ పడబోదు. వారిని కాపాడటం కోసం సుంకాల భారాన్ని సొంతగా భరించడానికీ సిద్ధం అని ప్రధాని స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు కొంటుందన్న కారణంతో భారత్‌పై 50శాతం సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో బాంబు పేల్చారు. తదుపరి మరిన్ని ఆంక్షలను చూస్తారంటూ హెచ్చరించారు. శ్వేతసౌధంలోని ఓవల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'భారత్‌పై మేం 50శాతం సుంకాలను విధించిన విషయం మీకు తెలుసు. ఆ దేశం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో రెండో స్థానంలో ఉంది. తొలిస్థానంలో ఉన్న చైనాకు అతి దగ్గరగా ఉంది. అందుకే భవిష్యత్తులో మరిన్ని ఆంక్షలను చూడబోతున్నారని పేర్కొన్నారు.

ట్రంప్ తీరు చూస్తుంటే పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది. తన వైఖరిని నెగ్గించుకోవడమే ఆయనకు ముఖ్యంగా ఉంది. ఎలన్ మస్క్ లాంటి వారినే దూరం పెట్టిన ట్రంప్‌కు భారత్ ప్రయోజనాలు ముఖ్యం కాదు. ఇకపోతే ఆపరేషన్ సింధూర్ తరవాత భారత్ సైనికంగా బలపడడంతో కూడా ట్రంప్ తట్టుకోవడం లేదని తెలుస్తోంది. ఇది కూడా ట్రంప్ వైఖరికి కారణం కావచ్చని వశ్లేషిస్తున్నారు. భారత్‌పై గతంలో విధించిన 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. అదనంగా విధించిన మరో 25శాతం ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. మన దేశంతోపాటు అనేక దేశాలపై సుంకాలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయి. దీనివల్ల బిలియన్ల కొద్దీ డాలర్లు అమెరికాకు వస్తాయని ట్రంప్ ప్రకటించారు. ఈ సుంకాలు 10శాతం నుంచి 50శాతం దాకా ఉన్నాయి. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత గత పదకొండేళ్లుగా ఇలా ఎప్పుడూ జరగలేదు. అవినీతిరహితంగా పాలన సాగుతుందన్న పేరు వచ్చింది. అలాగే సాహసోపేత నిర్ణయాలు కూడా తీసుకుని సత్తా చాటింది. అయోధ్య, కాశ్మీర్, ట్రిపుల్ తలాక్ విషాయల్లో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సైనిక సత్తా చాటాం. పాక్‌కు గట్టిగా బుద్ది చెప్పాం. ప్రపంచవ్యాప్తంగా భారత్చర్యలకు గట్టి మద్దతు లభించింది.

మోడీ సర్కార్ సాహస నిర్ణయాలకు వెనకాడదని రుజువు చేసుకుంది. సర్జికల్ స్ట్రయిక్స్ తరవాత, ఆపరేషన్ సిందూర్తరవాత కూడా పాక్ వైఖరిలో మార్పు రాలేదు. దాయాది దేశాన్ని ప్రపంచంలో దోషిగా నిలబెట్టిన ఘనత మోడీదే అని చెప్పక తప్పదు. ట్రంప్ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారో అని దేశం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఈ క్రమంలో భారత్ తన సార్వభౌమాధికరం ముఖ్యమని చాటి చెప్పాలి.

## గాజా సిటీ స్వాధీనానికి ఇజ్రాయెల్
# సెక్యూరిటీ క్యాబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ -08 ఆగస్ట్–తరంగాలు**

హమాస్ రెబెల్స్ కు, ఇజ్రాయెల్ సైన్యానికి మధ్య దాదాపు 23 నెలలుగా కొనసాగుతున్న యుద్ధం మరో కీలక మలుపు తిరిగింది. గాజా సిటీ ని పూర్తిగా స్వాధీనం చేసుకోవడం కోసం ఇజ్రాయెల్ రూపొందించిన ప్రణాళికకు ఆ దేశానికి చెందిన భద్రతా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు కార్యాలయం కూడా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తాజా పరిణామంతో గాజాలో సైనిక కార్యకలాపాలు మరింత విస్తృతం కానున్నాయి.సెక్యూరిటీ క్యాబినెట్ సమావేశానికి ముందు ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో కూడా ప్రధాని నెతన్యాహు ఈ విషయంపై కీలక వ్యాఖ్యలు చేశారు. 'మా భద్రతను పటిష్టం చేసుకునేందుకు, హమాస్‌ను పూర్తిగా తొలగించేందుకు, అక్కడి ప్రజలకు స్వేచ్ఛ కల్పించేందుకు గాజా మొత్తాన్ని నియంత్రణలోకి తీసుకోవాలని ఇజ్రాయెల్ భావిస్తోంది' అని తెలిపారు.



అయితే గాజాను శాశ్వతంగా అట్టిపెట్టుకునే ఉద్దేశం తమకు లేదని, అక్కడ ఒక భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసి, సరైన రీతిలో పాలించగల అరబ్ దళాలకు పాలనా బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు.కాగా నెతన్యాహు వ్యాఖ్యలపై హమాస్ తీవ్రంగా స్పందించింది. చర్చల ప్రక్రియను దెబ్బతీసేందుకే ఇజ్రాయెల్ ప్రధాని ఈ ప్రకటన చేశారని, యుద్ధం వెనుక ఉన్న ఆయన నిజమైన ఉద్దేశాలు ఇప్పుడు బయటపడ్డాయని ఒక ప్రకటనలో ఆరోపించింది. మరోవైపు గాజాలో మానవతా సంక్షోభం కూడా రోజురోజుకు తీవ్రమవుతోంది. 2023 అక్టోబర్‌లో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం 61,258 మంది పాలస్తీనియన్లు మరణించగా.. 1,52,045 మంది గాయపడినట్లు గాజా ఆరోగ్య అధికారులు గురువారం తెలిపారు.ఇజ్రాయెల్ దిగ్బంధనం కారణంగా గాజాలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో యూఏఈ, జోర్డాన్, జర్మనీ, బెల్జియం, ఫ్రాన్స్ దేశాలు బుధవారం 107 సహాయక ప్యాకేజీలను విమానాల ద్వారా గాజాలో జారవిడిచాయి. అయితే భూమార్గాల ద్వారా పెద్ద ఎత్తున సహాయాన్ని అనుమతిస్తే తప్ప, ఈ ఎయిర్‌డ్రాప్స్ వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని ఐక్యరాజ్యసమితి అధికారులు అంటున్నారు.మానవతా సాయం అందించేందుకు వీలుగా జూలై 27 నుంచి గాజాలోని జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సైనిక కార్యకలాపాలకు 'వ్యూహాత్మక విరామం' పాటిస్తున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. డేర్ అల్–బలా, అల్–మవాసి, గాజా సిటీ వంటి ప్రాంతాల్లో ఈ విరామాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపింది.

## ట్రంప్‌తో ఎలా వ్యవహరించాలో
# నరేంద్రమోదీకి చెబుతా

### ఇజ్రాయెల్ ప్రధాని

**న్యూఢిల్లీ -08 ఆగస్ట్–తరంగాలు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో ఎలా వ్యవహరించాలనే అంశంపై తాను భారత ప్రధాని నరేంద్ర మోదీ కి కొన్ని సలహాలు ఇస్తానని ఇజ్రాయెల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు చెప్పారు. నరేంద్ర మోదీ, డొనాల్డ్ ట్రంప్ ఇద్దరూ తనకు అత్యంత సన్నిహితులని, కాబట్టి తాను వారికి సాయపడగలనని ఆయన సూచనప్రాయంగా తెలిపారు.ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్న భారత జర్నలిస్టుల బృందంతో నెతన్యాహు మాట్లాడారు. ఈ సందర్భంగా కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ ఇద్దరూ నాకు మంచి స్నేహితులు. ట్రంప్‌తో డీల్ చేసే విషయంలో మోదీకి కొన్ని సలహాలు ఇవ్వాలనుకుంటున్నాను. అయితే ఆ విషయాలను నేను



బహిరంగంగా కాకుండా పర్సనల్‌గా చెబుతా' అని నెతన్యాహు అన్నారు. త్వరలోనే తాను భారత్‌లో పర్యటించాలని ఆశిస్తున్నట్లు నెతన్యాహు తన మనసులోని మాటను బయటికి చెప్పారు. భారత ఉత్పత్తులపై అమెరికా అదనంగా మరో 25 శాతం సుంకాలు విధించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో నెతన్యాహు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత వస్తువులపై ఇప్పటివరకు ఉన్న 25 శాతం సుంకాలను 50 శాతానికి పెంచనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అంతేగాక రష్యా నుంచి చమురు కొనుగోలును నిలిపివేయకపోతే మరిన్ని ఆంక్షలు విధిస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో నెతన్యాహు స్పందిస్తూ.. అమెరికా–భారత్ మధ్య బలమైన సంబంధాలు ఉన్నాయని, సుంకాల సమస్యను ఇరుదేశాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆకాంక్షించారు. భారత్–అమెరికా మధ్య సమస్య పరిష్కారమైతే అది ఇజ్రాయెల్‌కు కూడా మేలు చేస్తుందని నెతన్యాహు అభిప్రాయపడ్డారు. అదే సమయంలో ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు పూర్తి సహకారం అందిస్తామని నెతన్యాహు హామీ ఇచ్చారు. నిఘా సమాచారాన్ని పరస్పరం పంచుకుంటూ కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు. ఇదిలావుంటే గురువారం ఇజ్రాయెల్‌లోని భారత రాయబారి జేపీ సింగ్‌తో నెతన్యాహు సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చించినట్లు సమాచారం.

## ధరాలీ సహాయక చర్యల్లో ఇస్రో సహకారం..

### రెస్క్యూ టీమ్స్‌కు శాటిలైట్ చిత్రాలు




**న్యూఢిల్లీ -08 ఆగస్ట్–తరంగాలు**

ఉత్తరకాశీ జిల్లాలోని ధరాలీ గ్రామాన్ని ఇటీవల జలప్రళయం పెను విషాదంలోకి నెట్టింది. ఖీర్ గఢ్, భాగీరథీ నదులు ఉప్పొంగడంతో వరద నీరు ఒక్కసారిగా గ్రామాన్ని ముంచెత్తింది. పూర్తిగా పర్వత ప్రాంతాల్లో ఉన్న ధరాలీ గ్రామం బురదలో కూరుకుపోయింది. వరదలో పలు ఇండ్లు కొట్టుకుపోయాయి. మరికొన్ని ఇళ్లను బురద కప్పేసింది. ఈ ఘటనలో ఐదుగురు మరణించారు. వంద మందికిపైగా గల్లంతయ్యారు.దాంతో గల్లంతైన వారిని గుర్తించేందుకు రెస్క్యూ అపరేషన్ కొనసాగుతోంది. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ కూడా తనవంతు సహకారం అందిస్తోంది. ధరాలీ గ్రామానికి సంబంధించిన శాటిలైట్ చిత్రాలను రెస్క్యూ టీమ్స్‌కు ఇస్తోంది. ఆ శాటిలైట్ చిత్రాల ఆధారంగా గ్రామంలో భవనాలు ఉన్న ప్రాంతాలను గుర్తించి బురద తొలగిస్తున్నారు. బురదలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు ఇస్రో ఇస్తున్న శాటిలైట్ చిత్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అధికారులు చెబుతున్నారు. రెస్క్యూ ఆపరేషన్‌కు అవసరమైన అత్యాధునిక పరికరాలను యుద్ధ ప్రాతిపదికన విమానాల్లో ధరాలీ గ్రామానికి తరలిస్తున్నట్టు అధికారులు వివరించారు. కాగా గంగోత్రికి వెళ్లే యాత్రికులు మార్గమధ్యలో ధరాలీ గ్రామంలో ఆగుతుంటారు. ఈ క్రమంలో ధరాలీపై కొండచరియలు విరిగిపడ్డాయి. గ్రామాన్ని వరద ముంచెత్తింది. దాంతో పలు రోడ్లు మూతపడి యాత్రికులు ఎక్కడికక్కడ చిక్కుకుపోయారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## కెనడాలో గత 5 ఏళ్లలో 1200 మంది భారతీయులు మృతి



**టొరంటో -08 ఆగస్ట్–తరంగాలు**

కెనడా లో గత అయిదేళ్లలో 1203 మంది భారతీయ పౌరులు మృతిచెందినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2020– నుంచి 2024 మధ్య ఈ మరణాలు సంభవించాయి. చాలా వరకు మరణాలు ఓల్డేజ్ సమస్యలు, అనారోగ్యం వల్ల నమోదు అయినట్లు పార్లమెంట్‌లో ప్రభుత్వం పేర్కొన్నది. అయితే ఇదే సమయంలో సుమారు 757 మంది భారతీయులకు చెందిన భౌతికకాయాలను కెనడా నుంచి ఇండియాకు తీసుకువచ్చినట్లు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు.రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి కీర్తివర్ధన్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. రికార్డుల ప్రకారం ఎంత మంది భారతీయులు కెనడాలో మృతిచెందారో చెప్పాలని విదేశాంగ శాఖను ఎంపీలు ప్రశ్నించారు. యాక్సిడెంట్లు, హింస, సూసైడ్లు, మర్డర్ల లాంటి అసహజ మరణాలు కూడా చోటుచేసుకున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి ఏడాది సంభవించిన మరణాల సంఖ్యను వెల్లడించారు. 2020లో 120, 2021లో 160, 2022లో 198, 2023లో 336, 2024లో 389 మంది ప్రాణాలు కోల్పోయారు.

### గాజాను స్వాధీనం చేసుకునే ప్రణాళికను విరమించుకోవాలి



**ఐరాస --08 ఆగస్ట్–తరంగాలు**

గాజాను స్వాధీనం చేసుకోవాలనే ఇజ్రాయిల్ ప్రభుత్వ ప్రణాళికను వెంటనే విరమించుకోవాలని యుఎన్ మానవహక్కుల చీఫ్ వోల్కర్ టర్క్ శు క్రవారం హెచ్చరించారు. ఇజ్రాయిల్ తన ఆక్రమణను వీలైనంత త్వరగా నిలిపివేయాలని అన్నారు. ఈ ప్రణాళిక రెండు దేశాల పరిష్కారం మరియు పాలస్తీనియన్ల స్వయం నిర్ణయాధికార హక్కును సాధించాలనే తీర్పుకు విరుద్ధంగా ఉందని టర్క్ పేర్కొన్నారు. పూర్తి అడ్డంకులు లేని మానవతా సాయం పంపిణీని గాజాలోకి అనుమతించాలని స్పష్టం చేశారు. హమాస్ బేషరతుగా బంధీలను విడుదల చేయాలని, ఇజ్రాయిల్ కూడా ఏకపక్షంగా నిర్బంధించిన పాలస్తీనియన్లను వెంటనే విడుదల చేయాలని అన్నారు. హమాస్‌ను ఓడించేందుకు ప్రణాళిక ప్రకారం గాజాను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు ఇజ్రాయిల్ సైన్యం సిద్ధమవుతోందని నెతన్యాహూ కార్యాలయం ప్రకటించిన సంగతి తెలిసిందే.

తరంగాలు జాతీయ దిన పత్రిక RNI . TELTEL / 2022 / 83463
Tharangalu Daily News Paper

# బీహార్ లో ఓట్ల ఏరివేత ఒక అప్రజాస్వామిక చర్య



-సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎండి యాకుబ్.




**తొర్రూరు ఆగస్టు 8 తరంగాలు....**
బీహార్ రాష్ట్రంలో అక్రమంగా ఓట్ల వేరువేత కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టడం ఒక అప్రజాస్వామిక చర్య అని సిపిఎం పార్టీ తోరూర్ మండల కార్యదర్శి ఎండి యాకుబ్ అన్నారు. శుక్రవారం రోజు తోరూర్ మండల కేంద్రంలో సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బీహార్ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ కలిసి ఎన్నికల్లో గెలవడం కోసం అప్రజా స్వామీక చర్యకు పాల్పడడం ఎంతవరకు సమంజసమని వారు అన్నారు. ఈసీ కక్షపూరితంగా ముస్లింలను బెంగాలీలను ప్రతిపక్ష ఓటర్లను టార్గెట్ చేసుకొని 64 లక్షల ఓట్లను అక్రమంగా తీసివేయడాన్ని సిపిఎం పార్టీగా తీవ్రంగా ఖండిస్తున్నామని వారు ఈ సందర్భంగా అన్నారు. బీహార్ రాష్ట్ర పరిణామాలు దేశ ప్రజలందరినీ ఆందోళనకు గురి చేస్తుందని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఇలాంటి ఆ ప్రజాస్వామిక చర్యలను వెంటనే నిలిపివేయాలని లేకుంటే ప్రజలు ప్రజాస్వామిక వాదుల నుండి తీవ్ర వ్యతిరేకతను చూడాల్సి ఉంటుందని, వారు ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు మార్క సాంబయ్య, జమ్మల శ్రీను, సీనియర్ నాయకులు తాళ్ల వెంకటేశ్వర్లు, దొమ్మటి సోమయ్య, గజ్జి రామ్మూర్తి, తిమ్మిడి రవి, ఏకాంతం, పల్లె వెంకటేశ్వర్లు, యాకన్న, నాగన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# శభాష్ పోలీస్ అన్న

-వీధి నిర్వహణలో భారీ వర్షంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు బృంద
-జాతీయ రహదారిపై గల కల్వర్టు మరమ్మత్తు




**రఘునాధపల్లి:8(తరంగాలు న్యూస్)**
హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిలో గల రఘునాథపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా కలిగిన కల్వర్టు మూసి పోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం రాత్రి అకాల వర్షంతో జాతీయ రహదారి పై భారీగా నీరు చేరడంతో వెంటనే అప్రమత్తమైన పోలీసు సిబ్బంది రాత్రి ఏలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవడం జరిగింది. శుక్రవారం జనగామ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏడవెల్లి శ్రీనివాస్ రెడ్డి జెసిబి సహాయంతో కల్వర్టు మరమ్మత్తులు వేగవంతం చేశారు. సీఐ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రానున్న మూడు రోజుల్లో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున జాతీయ రహదారిపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యగా కల్వర్టు పనులను చేపట్టడం జరిగిందని వారు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ మారుజోడు రాంబాబు మాట్లాడుతూ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఈ కల్వర్టుకు ప్రధానంగా గ్రామం నుండి వచ్చే నీరు అధికం కావడంతో అందులో వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల ప్రతి సంవత్సరం ఈ కల్వర్టు వద్ద నీరు నిలిచి జాతీయ రహదారికి అంతరాయం కలిగిస్తుందని వారు అన్నారు. రానున్న రోజుల్లో అధిక వర్షాలు నమోదయ అవకాశం ఉన్నందున పూర్తిస్థాయిలో కల్వర్టును యుద్ధ పాతిపదికన పనులు చేపట్టారని వారు తెలిపారు. ఈ కర్యక్రమంలో రఘునాథపల్లి సబ్ ఇన్స్పెక్టర్ దూదిమెట్ల నరేష్ యాదవ్, స్థానిక కార్యదర్శి బాలు, కారోబార్ అజ్మత్,మాజీ వార్డ్ నెంబర్ కదారి చిన్న నాగేష్,శతారాశి నరేష్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...

# రంపచోడవరం ఏరియా హాస్పిటల్ ను తనిఖీ చేసిన

-ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ ట్రైబ్స్ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి





**రంపచోడవరం, ఆగస్టు 8,తరంగాలు :**
అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏరియా హాస్పిటల్ లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ ట్రైబ్స్ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయనకు పలు ఫిర్యాదులు అందడంతో ప్రతి వార్డు తిరిగి రోగుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. గిరిజనులు వారి బంధువులు ఆయనతో మాట్లాడుతూ ఆసుపత్రిలో సరైన సదుపాయాలు లేవని, డాక్టర్లు లేరని మమ్మల్ని ఎవరూ పట్టించుకోవట్లేదు అని, మరుగుదొడ్లు దుర్భరంగా ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గైనకాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్, అందుబాటులో లేరని, రేడియాలజిస్ట్, స్కానింగ్ సెంటర్ సిబ్బంది లేకపోవడంతో మెరుగైన వైద్యం అందక, పురిటి నొప్పులతో ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న గిరిజనలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వైద్యుల నియమకాలు చేయాలని, అంబులెన్స్ సదుపాయాలు కల్పించాలని, హాస్పటల్ లీకేజీ మరమ్మతులు వెంటనే చేయించాలని, రోగులు ఇబ్బంది పడకుండా పలు సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం గురువారం జరిగిన రోగి మరణంపై ఎంక్వయిరీ చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బొజ్జి రెడ్డి అన్నారు.
బొజ్జి రెడ్డి తో పాటు హాస్పిటల్ సూపరెంటెంట్ డా. శేషారెడ్డి తదితరులు ఉన్నారు.

# అరవింద పబ్లిక్ స్కూల్ లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



**ఖిలా వరంగల్, ఆగస్టు 8, తరంగాలు :**
రాఖీ పండుగను పురస్కరించుకొని వరంగల్ నగరంలోని రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్ లో ప్రిన్సిపాల్ పంచకం రమాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాలలో విద్యార్థినీలు విద్యార్థులకు రాఖీలు కట్టి సోదరీ భావాన్ని చాటుకున్నారు. అనంతరం మిఠాయిలు తినిపించుకొని ఒకరికొకరు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన కరస్పాండెంట్ పంచకం నర్సయ్య మాట్లాడుతూ హిందువులు జరుపుకునే పండుగలలో ముఖ్యమైనది రాఖీ పండుగ అని అన్నారు. అన్నా చెల్లెళ్లు, అక్క తమ్ముళ్ల మధ్య ప్రేమకు సూచికగా ఈ పండుగను జరుపుకుంటారు. రాఖీ అనగా రక్షణ బంధం అని అర్థం. సోదరీమణులు తమ సోదరులు ప్రతిపనిలో విజయం సాధించాలని కోరుకొని రాఖీ కడుతారు. అనంతరం మిఠాయిలు తినిపించి హారతి ఇచ్చి తమ క్షేమాన్ని కోరుకుంటారు. సోదరులు తమ సోదరికి జీవితాంతం రక్షణగా ఉంటామని వాగ్దానం చేస్తారని తెలిపారు. విద్యార్థులు పాఠశాలలో సోదర భావముతో ఒకరికొకరు రక్షణగా ఉంటూ మంచి వాతావరణంలో విద్యను అభ్యసించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ఉమా మహేశ్వర సేవ సమితి ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతం





**గణపురం ఆగస్టు 08 తరంగాలు:**
ధర్మారావుపేట శ్రీ ఉమామహేశ్వర దేవాలయంలో శ్రావణ శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకొని సామూహిక వరలక్ష్మి వ్రతం శ్రీ ఉమా మహేశ్వర సేవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు సామూహికంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారని సేవా సమితి అధ్యక్షులు ఆకుల సుభాష్ ముదిరాజ్ తెలిపారు.. శ్రావణమాసం శుక్ల పక్షం పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి వ్రతం చేయడం అనవయితీగా వస్తుందని సంప్రదాయమని వరలక్ష్మి వ్రతం చేస్తే అష్టలక్ష్మిని పూజించిన ఫలితం దక్కుతుందని సంతానం అష్టైశ్వర్యలతో పాటు ప్రేమ కీర్తి శాంతి సంతృప్తి సంతోషం శక్తి కోరుకున్న వరాలు సిద్ధిస్తాయని ఆలయ అర్చకులు లంక కిషన్ శర్మ తెలిపారు.

# కడియం కృషితో నిండిన చెరువులు

గోదావరి నీటికి పూజలు నిర్వహించిన జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు



**రఘునాధపల్లి:8(తరంగాలు న్యూస్)**
మాజీ ఉపముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చురువతో నియోజకవర్గంలోని అన్ని చెరువులకు మీరు అందించేందుకు కృషి చేస్తున్నారని అలాగే రఘునాథపల్లి మండలంలోని అన్ని చెరువులను జరిగిందని జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి లు అన్నారు. శుక్రవారం మండలంలోని మండల గూడెం గ్రామంలో గల మల్లిక చెరువు మత్తడి పోస్తుండడంతో గోదావరి నీళ్లకు మేరుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పదంలో నడుస్తుందని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో ముందంజలో ఉందని. కడియం చొరవతో 800 కోట్ల తో నియోజకవర్గ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు నామాల బుచ్చయ్య, తోటకూరి రమేష్, దేగల రాజశేఖర్,ఉతేపు సత్యనారాయణ, కుమార్ రఘుపతి, చెంద్రయ్య, ముప్పిడి లక్ష్మణ్, శంకరి రాజు, పిట్టల వెంకటేష్, ఎండి మస్తాన్, ప్రశాంత్,గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీఎం పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు






**గణపురం ఆగస్టు 08 తరంగాలు:**
చెల్పూర్ ఎంజీఎం పాఠశాలలో శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమి రోజున జరుపుకునే రాఖీ పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థుల్లో అన్నాచెల్లెళ్లు లేదా అక్కా తమ్ముళ్ల మధ్య సంబంధాన్ని నెలకొల్పే విధంగా విద్యార్థినులు ప్రతి విద్యార్థులకు రాఖీ బంధాన్ని ఏర్పరిచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గ్యాదంగి సతీష్ మాట్లాడుతూ రాఖీ అనగా రక్షించడమని సోదరులు ,సోదరీమణుల మధ్య ప్రేమానురాగాల అనుబంధాన్ని తెలియజేసేదని ,ఈ పండుగ పురాణాల్లో అనేక కథలు ప్రచారంలో ఉన్నప్పటికీ నేటికీ అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు, అనురాగానికి ప్రతీకగా జరుపుకుంటారని తెలియజేశారు. ఉపాధ్యాయినిలు, ప్రిన్సిపాల్ కు సహచర ఉపాధ్యాయులకు రాఖీ కట్టి వారి నుండి చిరుకానుకలు పొంది సోదర, సోదరీమణుల అనుబంధాన్ని బలపరిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు గ్యాదంగి తిరుపతి ,గ్యాదంగి రమాదేవి ,సిలువేరు శ్రీనివాస్, ప్రిన్సిపల్ మధుకర్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దేవాలయంలో శ్రావణ శుక్రవారం శుభ భక్తులతో కిటకిరాలైన ఆలయాలు

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ 15వ వార్షికోత్సవం



**రఘునాథపల్లి. 8(తరంగాలు న్యూస్)** శ్రావణ శుక్రవారం వరలక్ష్మి పండుగ సందర్భంగా మండలంలోని వివిధ ఆలయాలలో శ్రావణ శోభ సంతరించుకుంది భక్తులతో ఆలయాలు రాద్దిగా మండల కేంద్రంలో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి 15వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ లాగిశెట్టి బాలమణి బిక్షపతి దంపతులు వరలక్ష్మి దేవి ప్రత్యేక పూజలు, అర్చనలు, హెూమం నిర్వహించారు. మూడు రోజులపాటు ఆలయంలో ప్రత్యేక పూజలు ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని లెగిశెట్టి బిక్షపతి తెలిపారు. నేడు రాఖీ పౌర్ణమి సందర్భంగా సాంప్రదాయ దుస్తులలో ఆలయానికి రావాలని భక్తులను కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహాదేవ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కూరెళ్ళ ఉపేందర్ రేణుక దంపతులు, లగిశెట్టి లింగయ్య దంపతులు, గందె వీరయ్య, గందె రవి, పోకల పోషనాథం, మహాదేవ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు పిండిప్రోలు శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు




**రఘునాథపల్లి:8(తరంగాలు న్యూస్)** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన బహుజన వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రఘునాథపల్లి మండలం కోడూరు గ్రామ ముదిరాజ్ సంఘం యూత్ ఆధ్వర్యంలో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ముదిరాజ్ సంఘం యూత్ నాయకులు మాట్లాడుతూ పండుగ సాయన్న ముదిరాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అన్నారు. పండుగ సాయన్న సామాజిక న్యాయం కోసం, రాజ్యాధికారంలో బీసీలకు న్యాయమైన వాటా కోసం పోరాటం సాగించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు దాసరి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ మడికంటి కర్ణాకర్, మాజీ ఉపసర్పంచ్ దాసరి నర్సింహులు, యూత్ అధ్యక్షులు దాసరి హరీష్, దాసరి సందీప్, మడికంటి శంకర్, దాసరి నవీన్, రాకేష్, రవి, అనీల్, యాకయ్య, అజయ్, కార్తీక్, చంద్రయ్య,లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రొబెల్ మోడల్ పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

## పాఠశాల ప్రాంగణంలో అబాకస్ డే నిర్వహణ







**గణపురం ఆగస్టు 08 తరంగాలు:** మండల కేంద్రంలోని ప్రొబెల్ మోడల్ పాఠశాలలో శుక్రవారం ఘనంగా ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా విద్యార్థిని విద్యార్థులకు సాంప్రదాయ రీతిలో నుదుటిన కుంకుమ తిలకం దిద్ది రక్షాబంధన్ వేడుకలు ప్రారంభించారు. అనంతరం విద్యార్థినిలు విద్యార్థులు ఉపాధ్యాయులు నీవు నాకు రక్ష నేను నీకు రక్ష మనమంతా దేశానికి రక్ష అని నినాదాలతో పాఠశాల గ్రౌండ్ లో హెూరెత్తించారు స్వీట్లు పంచారు ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ల్యాదల్ల కృష్ణ గౌడ్ మాట్లాడుతూ మనమంతా కులమత బేధాలు లేకుండా జరుపుకునే పండుగ మనం ఐక్యంగా ఉండి మన జాతిని మన దేశాన్ని కాపాడుకోవాలని విద్యార్థిని విద్యార్థులు సోదర భావం కలిగి ఉండాలని మన సంస్కృతిని కాపాడుకోవాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు.ఘనంగా అబాకస్ డే వేడుకలు రక్షాబంధన్ వేడుకల అనంతరం ఇంటర్నేషనల్ అబాకస్ డే కార్యక్రమాన్ని పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారి మేధాశక్తిని మెరుగుపరచుకోవడానికి వారిని గణితంలో జ్ఞానాన్ని పొందడానికి ఈ కార్యక్రమంలో వివరించారు. ఈ కార్యక్రమంలో ల్యాదల్ల యాదగిరి గౌడ్, పబ్బా శంకర్ గౌడ్, సుంకరి జగన్ రెడ్డి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బీసీలను మోసం చేస్తోంది కాంగ్రెస్ పార్టీ





శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి

**హన్మకొండ ప్రతినిధి, ఆగస్టు 8,తరంగాలు :** కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి అన్నారు.హనుమకొండ బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ జిల్లా కార్యాలయంలో పత్రిక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి మాట్లాడుతూ ఈ నెల 5, 6 తేదీల్లో బీసీ అంశంపై రేవంత్ రెడ్డి ఢిల్లీలో భూకంపం సృష్టిస్తామని చెప్పి తన అసమర్థతతో బీఆర్ఎస్, బీజేపీ ని తిట్టి తన డొల్ల తనాన్ని నిరూపించాడని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అంటే సోనియా, రాహుల్, ఖర్గే అయితే అలాంటి అగ్రనాయకత్వమే ఢిల్లీ బీసీ రిజర్వేషన్ ధర్నా లో పాల్గొనలేదని ఇద్దేవా చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆనాడు టీఆర్ఎస్, బీఆర్ఎస్ కు ఉన్న ఎంపీ ల సంఖ్య చాలా తక్కువ... కానీ నేడు మెజారిటీ సంఖ్య ఎంపీలు ఉన్న కాంగ్రెస్ కి బీసీ రిజర్వేషన్ సాధించకపోవడము సీఎం చిత్తశుద్ధికి నిదర్శనం అని అన్నారు.అనేక సందర్భాల్లో సోనియాని బలి దేవత అన్న రేవంత్ రెడ్డి, నేడు ఎలా మాట్లాడుతున్నాడో ఆయన మాట మార్చే విధానానికి తార్కణం అని,రాష్ట్రపతి అపాయింట్మెంట్ దొరకలేదు అని సీఎం అంటున్నారు.. మీ నాయకులే మీకు అపాయింట్మెంటే ఇవ్వడం లేదని అన్నారు.రాహుల్ గాంధీ ప్రధాని అయితే బీసీ రిజర్వేషన్ అమలు చేస్తారు అంటున్నారు.రాహుల్ గాంధీ ప్రధాని ఎన్నడు కావాలి బీసీ రిజర్వేషన్ ఎన్నడు రావాలి.ఢిల్లీలో గురువారం మాట్లాడాల్సిన అంశం కాకుండా కేసీఆర్ గురించి మాట్లాడుతున్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ 20 నెలల పాలన అధ్వాన్నంగా ఉన్నది ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాము దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బీసీ ల ద్రోహి పార్టీ గా గుర్తించాలన్నారు.

**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మరొక్కసారి బీసీ ప్రజల్ని మోసం చేసిందన్నారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధ రామయ్య అనే పక్క రాష్ట్ర బీసీ ముఖ్యమంత్రిని తీసుకొచ్చి ఎన్నికల ముందు బీసీ అంశంపై వాగ్దానం చేసింది. కానీ నాటి హామీలు నేటి కాంగ్రెస్ మోసాలుగా మారాయి. బీసీ లకు ప్రతీ బడ్జెట్ లో 20 వేల కోట్లు పెడుతామని కాంగ్రెస్ పోయిన రెండు బడ్జెట్ల లో 7, 10 వేల కోట్లే కేటాయించారు.

లక్ష కోట్లు బీసీ లకు కేటాయిస్తామని కాంగ్రెస్ మోసం చేసింది. రాష్ట్రంలో బీసీ లకు అన్ని రంగాల్లో 42 శాతం అవకాశాలు కల్పిస్తామని, వేల కోట్ల కాంట్రాక్టు లు మంత్రి శ్రీనివాస్ రెడ్డి కి, మెగా కృష్ణారెడ్డి కి ఇచ్చారు.కానీ బీసీ కాంట్రాక్టర్లకు ఇవ్వలేదు.అతి త్వరలో వరంగల్ వేదికగా కాకతీయ యూనివర్సిటీ వేదికగా బీసీ హక్కుల కోసం పోరాటాలకు శ్రీకారం చుడతామన్నారు.ఈ నెల 14న కరీంనగర్ వేదికగా బీసీ ల కోసం బీఆర్ఎస్ పార్టీ హయాంలో బహిరంగ సభను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, మాజీ చైర్మన్ చింతం సదానందం, నాయకులు జనార్దన్ గౌడ్, పులి రజినీకాంత్, నాయిముద్దీన్, శోభన్, జానకిరాములు, విజయ్ రెడ్డి, ఖలీల్, రాజు యాదవ్, వినీల్ రావు, రాజ్ కుమార్, శ్రీధర్,ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల సాధన కోసం పాటుపడాలి

- మండలకేంద్రంలో ఈనెల 12న ధర్నా..
- బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరి..
- బీజేపీ రాష్ట్రాల్లో ఒకలా..తెలంగాణలో మరోలా..!
- సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్




**పాలేరు ఆర్సీ, 08ఆగస్టు (తరంగాలు) :** రాష్ట్రంలో 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈనెల 12న మండల కేంద్రంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని పద్మారెడ్డి భవనంలో ఎడవల్లి రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన మండల కార్యదర్శివర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కులగణన పూర్తి అయిందని దీని ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టగా అన్ని పార్టీల రాజకీయ పార్టీలూ మద్దతు ఇచ్చాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ అమల్లో బీజేపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ ను అడ్డుకుంటుందని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్సును పంపిస్తే గవర్నర్ జాప్యం చేస్తున్నారని విమర్శించారు.

**బీజేపీ రాష్ట్రాల్లో ఒకలా..తెలంగాణలో మరోలా..**

బీసీ రిజర్వేషన్లను బీజేపీ పాలిత ప్రాంతాలలో అమలు చేస్తూ ఆ పార్టీ నాయకులు ఇక్కడ అడ్డుకోవడం బీజేపీ ద్వంద్వ వైఖరి బయటపడిందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లలో ముస్లింలను తొలగించాలని అక్రమ డిమాండ్ ను బీజేపీ ముందుకు తీసుకొస్తుందని, కానీ గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, లాంటి బీజేపీ పాలిత రాష్ట్రాలలో ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేస్తూ.. తెలంగాణలో మాత్రం అమలు చేయకూడదని అడ్డు తగలడమేంటని ఆయన ప్రశ్నించారు. దీనిపై సామాజిక న్యాయం కోరే శక్తులన్నీ ఆలోచించి, బీసీ రిజర్వేషన్లకు అందరూ మద్దతు తెలిపాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీల 42 శాతం రిజర్వేషన్ అమల్లో కాంగ్రెస్ పార్టీ మిగతా పార్టీని కలుపుకొని ముందుకు సాగాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) చేపట్టాలన్న ఎన్నికల కమిషన్ ప్రత్యామ్నాయాన్ని బీజేపీ స్వార్థపూరితంగా ఉపయోగించుకుంటుందని, సవరణ పేరుతో దొంగ ఓట్లను బీజేపీ భారీ నేరపూరిత మోసానికి పాల్పడుతుందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారని గుర్తు చేశారు. మహాదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో 1,00,250 దొంగ ఓట్లు ఉన్నట్లు రుజువైందని, దేశంలో బీజేపీ ఇలాంటి మోసాలకు పాల్పడి, ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేసే కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, జిల్లా నాయకులు మల్లెల సన్మతరావు, బషీరుద్దీన్, మండల కార్యదర్శివర్గ సభ్యులు శీలం గురుమూర్తి, బిక్కసాని గంగాధర్, కర్ణబాబు, గన్య నాయక్, సోషల్ మీడియా ఇంచార్జ్ కార్తిక్, పాల్గొన్నారు.

# వర్షాకాల సీజన్ నేపద్యం లో ప్రత్యేక

-అంటువ్యాధులు ప్రబలకుండా చేస్తున్న అజ్మీర్ తండా పంచాయతీ సెక్రెటరీ .

-గత 15 రోజులుగా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో పటిష్టమైన చర్యలు చేపడుతున్న పంచాయతీ సెక్రటరీ అబ్దుల్ రహమాన్, ఏఎన్ఎం సీత, అనిత



**పాలేరు ఆర్సీ ,08ఆగస్టు ( తరంగాలు )** పాలేరు నియోజకవర్గంలో తిరుమలాయపాలెం మండలంలో అజ్మీర తండా, గ్రామపంచాయతీని సీజనల్ వ్యాధుల పట్ల వర్షాకాలం నేపథ్యంలో గత సంవత్సరం లో జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని గ్రామానికే పరిమితమై ముందస్తు చర్యలుగా గ్రామాన్ని శుభ్రపరుస్తున్న పంచాయతీ సెక్రెటరీ అబ్దుల్ రెహమాన్, ఏఎన్ఎం సీత, అనిత గత సంవత్సరం ఇదే సీజన్లో అజ్మీర తండా పరిసర గ్రామాలలో డెంగ్యూ వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉండేది గత సంవత్సరం ఈ గ్రామపంచాయతీలలో ఎక్కువగా డెంగ్యూ కేసులు నమోదయి తీవ్ర ఇబ్బందులకు గురైన ఘటనలో విధితమే వాటిని దృష్టిలో పెట్టుకొని ,ఈ సంవత్సరం అలాంటి పరిణామాలు ఎదురుకాకుండా ముందస్తు చర్యలుగా ఆ గ్రామా పంచాయతీ సెక్రటరీ అబ్దుల్ రెహమాన్, ఏఎన్ఎం సీత , అనిత, ఆశా, కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టి చొరవతోటి ముందస్తు చర్యలుగా గ్రామాలలోని మురికి కాలువలు, గ్రామంలోని ప్రధాన రహదారులు ఎక్కడ కూడా మురుగునీరు నిల్వ ఉండకుండా, గ్రామపంచాయతీ సిబ్బంది తోటి క్లీన్ అండ్ గ్రీన్ చేస్తూ గ్రామాన్ని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేస్తున్నారు. ఎప్పటికప్పుడు బ్లీచింగ్, ఫాగింగ్ వాటర్ బాల్స్ చేయిస్తూ గ్రామాన్ని శుభ్రంగా ఉంచుతున్నారు. ఇలాంటి ముందస్తు చర్యల వల్ల గ్రామాలలో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ఆస్కారం ఉందని గ్రామస్తులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గ్రామాన్ని రూపురేఖలు మారుస్తున్న అబ్దుల్ రెహమాన్ ని గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఇలాగే అన్ని గ్రామపంచాయతీలోని సెక్రెటరీ కూడా ప్రత్యేక చొరవ సూపి గ్రామపంచాయతీ లపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాలలో మురుగుని తొలగించి గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేయాలని మండల ప్రజానీకం కోరుకుంటున్నారు.

తరంగాలు జాతీయ దిన పత్రిక Tharangalu Daily News Paper RNI. TELTEL / 2022 / 83463

# సనాతన ధర్మ రక్షణ కోసం పాటుపడాలి

**నర్సంపేట ఆగస్టు 09 తరంగాలు :** దేశం కోసం సనాతన ధర్మ రక్షణ కోసం ప్రతి హిందువు పాటుపడాలని తెలంగాణ రాష్ట్ర బజరంగ్దళ్ కన్వీనర్ శివరాములు సూచించారు. విశ్వహిందూ పరిషత్ స్థాపన దివాస్ ను శుక్రవారం ఆ సంఘం నర్సంపేట అధ్యక్షుడు చోల్లేటి జగదీశ్వర్ అధ్యక్షతన పట్టణంలోని డపోడిల్స్ స్కూల్ ఆడిటోరియంలో విశ్వహిందూ పరిషత్ స్థాపన దివాస్ ను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా శివ రాములు మరియు నందాల చందర్ బాబు లు మాట్లాడుతూ 1964 వ సంవత్సరం శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన విశ్వహిందూ పరిషత్ సంస్థ ఆవిర్భవించిందని సనాతన ధర్మరక్షణ ధ్యేయంగా ఏర్పడినటువంటి



విశ్వహిందూ పరిషత్ 60 సంవత్సరాలు ముగించుకొని 61వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా హిందూ బంధువులకు శుభాకాంక్షలు తెలిపారు ప్రతి హిందువు దేశం కోసం సనాతన ధర్మ రక్షణ కోసం దేవాలయాల పరిరక్షణ కోసం గోవధ నిర్మూలన కోసం లవ్ జిహాద్ ఆగడాలను రూపుమాపడం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలిపారు యువకులు బజరంగ్దళ్ దుర్గావాహిని వంటి విభాగాల్లో చేరి ధర్మ రక్షణ చేస్తూ ఆదర్శవంతంగా ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షురాలు డా. ఆంధ్రు వనజ కార్యదర్శి వెలుగందుల రాజు సహాయ కార్యదర్శి మల్యాల రవి నర్సంపేట ప్రఖండ ఉపాధ్యక్షుడు డా. అజ్మీర వీరన్న కార్యదర్శి వేల్పుల శ్రీధర్ సహా కార్యదర్శి సిరిమల్ల నరేందర్ కోశాధికారి కలకోటి సుదర్శన్ సేన ప్రముఖ్ దోనాల రవి గోరక్ష ప్రముఖ గన్నోజు నాగార్జున బజరంగ్దళ్ కన్వీనర్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు మహిళల దారుణ హత్య






**జఫర్గఢ్ ప్రతినిధి, ఆగస్టు 8,(తరంగాలు):** మండలంలోని తమ్మడపల్లి (ఐ) గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు మహిళలను శుక్రవారం ఉదయం దారుణ హత్య చేశారు. రాణి 50 సంవత్సరాలు తుమ్మ అండమ్మ 83 సంవత్సరాలు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. హత్యకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.సంఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు







**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 8,తరంగాలు :** శ్రావణ మాసం వరలక్ష్మీవ్రతం సందర్భంగా భక్తులు శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడానికి దేవాలయానికి పోటెత్తారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ఓడిబియ్యం పోసి అమ్మవారికి చీరలు సమర్పించారు. భక్తులు ఉదయం నుండి అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు, మంచినీరు మరియు ప్రసాద వితరణ ఏర్పాట్లు దేవాలయ చైర్మన్ డా.బి. శివసుబ్రహ్మణ్యమ్, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్కుమార్ రెడ్డి, మోతుకూరి మయూరి రామేశ్వర్రావు,గాండ్ల స్రవంతి, తొగరు క్రాంతి,ఓరుగంటి పూర్ణచందర్, పాలడుగల ఆంజనేయులు, బింగి సతీష్, అనంతుల శ్రీనివాస్ రావు, జారతి వెంకటేశ్వర్లులు పర్యవేక్షించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు ఆలయ ఈఓ శ్రీమతి రామల సునీత ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనం అనంతరం ముత్తయిదువలు వాయినాలు ఇచ్చుకున్నారు.అమ్మవారిని వరంగల్ పశ్చిమ నియోజక వర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజానంతరం అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు.

# కేసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ సోదాలు

**మత్తుపదార్థాలు,అక్రమ వాహనాల పట్టివేత**





**మహబూబాబాద్., ప్రతినిధి, ఆగస్టు.08, ( తరంగాలు)** కేసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలోని గిర్నితండ గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించబడింది.ఈ ఆపరేషన్లో డీఎస్పీ తిరుపతి రావు నేతృత్వంలో 70 మంది సిబ్బందిపాల్గొన్నారు.తనిఖీల్లో 2 క్వింటాళ్ల నల్ల బెల్లం, 1,000 లీటర్ల ఫెర్మెంటెడ్ వాష్, 50 లీటర్ల గూడుంబా, 40 డాక్యుమెంటులు లేని ద్విచక్ర వాహనాలుగుర్తించబడ్డాయి.అక్రమ మత్తుపదార్థాల ఉత్పత్తిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ తిరుపతిరావు మాట్లాడుతూ, మత్తుపదార్థాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల సహకారం అవసరం అని పేర్కొన్నారు.ఆపరేషన్లో సర్కిల్ ఇన్స్పెక్టర్ సర్వయ్య,ఎస్ఐలు మురళీధర్ రాజ్,కరుణాకర్, సతీష్, కిరణ్, నరేష్,ఆర్ఐలు భాస్కర్,సోములు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి,

**పట్టణంలో ఆకస్మిక పర్యటన చేసిన (ఇన్చార్జి) కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో,**





**మహబూబాబాద్., ప్రతినిధి, ఆగస్టు. 08,( తరంగాలు)** శుక్రవారం ఉదయం ఇంచార్జ్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో మహబూబాబాద్ పట్టణంలోని వార్డులను, మార్కెట్, జక్షన్లు ప్రాంతాలలో జరుగుతున్న శానిటేషన్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు,పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రణకు మున్సిపల్ సిబ్బంది, ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ, షెడ్యూల్ ప్రకారం ప్రతీ రోజూ వార్డులు మార్కెట్ జక్షన్లు ప్రాంతాలలో శానిటేషన్ చెయ్యాలని, నీరు నిలువ ఉండే ప్రదేశాలలో ఆయిల్ బాల్స్ వేయాలని, వ్యర్థాలను వెంట వెంటనే తరలించి, తడి చెత్త, పోడి చెత్త ను వేరు చేసి సెగ్రిజేషన్ చేయాలన్నారు,ప్రస్తుతం వర్షాలు కురుస్తునందున, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలని,ప్రజలు మున్సిపల్ ఆస్తి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు, పెండింగ్ లో ఉన్న జంక్షన్లు, అంతర్గత రోడ్ల నిర్మాణం, కాలువలు, తదితర అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు,ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. రాజేశ్వర్, శానిటరీ ఇన్పెక్టర్ సుధాకర్, తదితరులు ఉన్నారు.

# శ్రీ వివేకవర్ధినిలో ముందస్తు రాఖీ వేడుకలు



**మహబూబాబాద్.,ప్రతినిధి, కేసముద్రం, ఆగస్టు.08, (తరంగాలు)** శ్రీ వివేకవర్ధిని హైస్కూల్లో ముందస్తు రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులకు రాఖీ కట్టి శు భాకాంక్షలు తెలియజేశారు. .ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ ,చిర్రా నరేష్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తిరుమలాయపాలెం అంగన్వాడి 1వ సెంటర్లో రక్షాబంధన్.

**బడి పిల్లలకు రక్షాబంధన్ కట్టి పండగ యొక్క విశిష్టతను తెలిపిన అంగన్వాడీ టీచర్.**



**పాలేరు ఆర్సీ ,08ఆగస్టు (తరంగాలు)** తిరుమలాయపాలెం మండలం కేంద్రంలో గల అంగన్వాడి 1 సెంటర్లో అంగన్వాడీ టీచర్. ఇప్పల గీత చిన్నపిల్లలకు రాఖీలు కట్టి రక్షాబంధన్ పండుగ విశిష్టతను తెలిపినారు .అన్నా, చెల్లెలు, అక్క, తమ్ముడు, అనే బంధానికి నిదర్శనం ఈ రాఖీ పండుగని ప్రతి శ్రావణ మాసంలో పౌర్ణమి రోజున ఆడపడుచులు ఘనంగా జరుపుకునే ఈ రాఖీ పండుగ చాలా విశిష్టత ఉన్నది ప్రతి ఒక్కరు కూడా కుటుంబంలోనే ఆడపడుచులను సాంప్రదాయ బద్ధంగా గౌరవిస్తూ, ఆడపిల్లలు అత్తవారిళ్ల నుండి తమ అన్న తమ్ముళ్ల వద్దకు వచ్చి ఆప్యాయతతో అనురాగాల మధ్యన రక్షాబంధనం కట్టి అన్నయ్యలు, తమ్ముడిల తో ఆశీర్వాదం తీసుకుంటారు. నిండు మనసుతో ఆడపిల్లలను ఆశీర్వదించి అన్నా చెల్లెలు, అక్క తమ్ముళ్ల, ఆప్యాయత అనురాగాలకి నిదర్శనంగా పూర్వం నుండి ఈ పండుగను జరుపుకుంటారు. ఇలాంటి పండుగను ముందస్తుగా తిరుమలాయపాలెం అంగన్వాడి సెంటర్లో నిర్వహించటం పిల్లలకు ఆ యొక్క పండగ విశిష్టతను తెలియపరచడం చాలా ఆనందంగా ఉందని పిల్లలు తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన పెద్ది



**నర్సంపేట ఆగస్టు 09 తరంగాలు:** నర్సంపేట నియోజకవర్గం లో శుక్రవారం జరిగిన పలు వివాహ వేడుకలలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు నర్సంపేట బీ.ఆర్.ఎస్ ముఖ్య నాయకుడు ప్రముఖ న్యాయవాది కీ.శే. గూళ్ల అశోక్ కుమార్ కుమారుడు సాయి చరణ్ విద్యా శ్రీ ల వివాహం పిడిఆర్ గార్డెన్స్ లో నిర్వహించగా వివాహానికి పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు క్లస్టర్ బాధ్యులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి తాబేదారులుగా ఎన్నికల సంఘం

**సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు చాగంటి కిషన్**




**మహబూబాబాద్., ప్రతినిధి, కేసముద్రం, ఆగస్టు.08, (తరంగాలు)** కేసముద్రం మండలం అంబేద్కర్ సెంటర్లో సిపిఐ(ఎం) పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బీహార్ రాష్ట్రంలో ఓట్ల తొలగింపు నిరసిస్తూ,ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కా. చాగంటి కిషన్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం పక్షపాత వైఖరి వ్యవహరించకుండా ఉండాలని కానీ పాలక పార్టీ బిజెపికి తాబేదారుగా మారి బీహార్ రాష్ట్రంలో65 లక్షల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యాన్ని హననం చేయడం అని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కొరకు దేశవ్యాప్తంగా సిపిఎం పార్టీ నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని,దీనికి ప్రజలందరు మద్దతుతెలియజేయాలన్నారు.సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గోడిశాల వెంకన్న,అల్లుగొండ సావిత్ర,నీరటి జలంధర్,జల్లే జయరాజ్,సోమరపు ఎల్లయ్య,ఇస్లావత్ పతాని,కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## నష్టాల్లో స్టాక్ మార్కెట్‌లు.. 80 వేల మార్క్ దిగువకు సెన్సెక్స్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన టారిఫ్‌ల భయాల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం కుప్పకూలాయి. అన్ని రంగాల్లోనూ అమ్మకాలు ఒత్తిడి పెరగడంతో సూచీలు భారీగా పతనమయ్యాయి. ఫలితంగా సెన్సెక్స్ 80 వేల మార్క్ దిగువకు పడిపోయింది. మూడు నెలల కనిష్ఠ స్థాయికి చేరింది. దాంతో మదుపరులు తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వచ్చింది.భారత్ నుంచి వచ్చే దిగుమతులపై సుంకాలను 50 శాతానికి పెంచామని, రష్యా నుంచి చమురు దిగుమతిని కొనసాగిస్తే ఈ టారిఫ్‌లను మరింత పెంచుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ ప్రకటన దేశీయ మార్కెట్లలో తీవ్ర ఆందోళనకు దారితీసింది. దీనికితోడు విదేశీ సంస్థాగత మదుపరులు నిరంతరాయంగా తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడంతో పతనం మరింత తీవ్రమైంది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 765.47 పాయింట్లు నష్టపోయి 79,857.79 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సమయంలో ఒక దశలో 79,775 పాయింట్ల కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. అదేవిధంగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 232 పాయింట్లు కోల్పోయి 24,363.30 వద్ద ముగిసింది. రియల్టీ, మెటల్, ఆటో, ఐటీ, బ్యాంకింగ్ షేర్లు తీవ్రంగా నష్టపోయాయి. సెన్సెక్స్ బాస్కెట్‌లో భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్, ఇన్ఫోసిస్ వంటి ప్రధాన షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఎన్‌టీపీసీ, టైటాన్ లాంటి కొన్ని షేర్లు మాత్రమే లాభపడ్డాయి. కాగా వరుసగా ఆరో వారంలోనూ మార్కెట్లు నష్టాలతోనే ముగియడం గమనార్హం.

## ఆల్‌టైం గరిష్ఠానికి పసిడి ధరలు.. ఎంతకు చేరుకున్నాయంటే..

దేశంలో పసిడి ధరలు ఆల్ టైం గరిష్టానికి చేరుకుని మరోసారి షాక్ ఇచ్చాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు 8, 2025 ఉదయం 6:10 గంటల సమయానికి బంగారం ధరలు సరికొత్త స్థాయికి చేరాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,02,560కి చేరగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 94,010కి చేరుకుంది.

ఇదే సమయంలో వెండి ధరలు కూడా పెరిగాయి . కిలో వెండి ధర రూ. 1,17,100 స్థాయిలో ఉంది. ఈ ధరల పెరుగుదల దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో కొనసాగుతోంది. స్థానిక పన్నులు, రవాణా ఖర్చులు, మార్కెట్ డిమాండ్ ఆధారంగా ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి.

**ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా..**

హైదరాబాద్: 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,02,560.. 22 క్యారెట్ల బంగారం రూ. 94,010, వెండి (1 కిలో) రూ. 1,27,100.

ఢిల్లీ: 24 క్యారెట్ల బంగారం రూ. 1,02,710.. 22



క్యారెట్ల పసిడి రూ. 94,160, వెండి రూ. 1,17,100.

చెన్నై: 24 క్యారెట్ల గోల్డ్ రూ. 1,02,560.. 22 క్యారెట్ల బంగారం రూ. 94,010, వెండి రూ. 1,27,100.

ముంబై: 24 క్యారెట్ల పసిడి రూ.1,02,560, 22 క్యారెట్ల గోల్డ్ రూ. 94,010, వెండి రూ. 1,17,100.

బెంగళూరు: 24 క్యారెట్ల బంగారం రూ. 1,02,560, 22 క్యారెట్ల పసిడి రూ.94,010, వెండి రూ. 1,17,100.

**బంగారం, వెండి ధరల ప్రధాన పెరుగుదలకు కారణాలు**

బంగారం, వెండి ధరలు మళ్లీ పెరగడానికి అనేక అంతర్జాతీయ, దేశీయ కారణాలు ఉన్నాయి. ప్రధానంగా అమెరికా-చైనా మధ్య వాణిజ్య అంశాలు తీవ్రతరం కావడం, అమెరికా డాలర్ విలువ క్షీణించడం ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొత్త టారిఫ్ ప్లాన్లు, అమెరికా అప్పులు 36 ట్రిలియన్ డాలర్లకు చేరడం వంటి అంశాలు పెట్టుబడిదారులను బంగారం, వెండి వంటి సురక్షిత ఆస్తుల వైపు మొగ్గేలా చేశాయి. దేశంలో దిగుమతి సుంకాలు, స్థానిక మార్కెట్ డిమాండ్ కూడా ధరల పెరుగుదలకు దోహదపడ్డాయి.

## ఎస్‌బిఐ ఫలితాలు భళా

**క్యూ1లో రూ. 19,160 కోట్ల లాభాలు**

**పెరిగిన నికర వడ్డీ ఆదాయం**

**న్యూఢిల్లీ**

దేశంలోనే అతి పెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఆకర్షణీయ ఆర్థిక పలితాలను ప్రకటించింది. ఆర్థిక సంవత్సరం 2025- 26 జూన్ పీఏటీఏ ముగిసిన మొదటి త్రైమాసికం ( క్యూ1) మొండి బాకీలను కట్టడి లో ఉంచడం తో పాటు వడ్డీ ఆదాయం పెరగడం బ్యాంకు మెరుగైన ఆర్థిక ఫలితాలకు ప్రధాన మద్దతును ఇచ్చాయి. ఈ నేపథ్యంలో గడిచిన త్రైమాసికంలో ఆ బ్యాంకు నికర లాభాలు 12.4 శాతం పెరిగి రూ. 19,160.44 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో రూ. 17,035.16 కోట్ల లాబాలు ఆర్టించది. మార్కెట్ అంచనాలైన రూ. 17,095 కోట్లను అధిగమించింది.

**గడిచిన క్యూ1లో**

నికర వడ్డీ ఆదాయం 0.1 శాతం శాతం తగ్గి రూ. 41,072 కోట్లకు చేరింది. గత




ఏడాది రూ. 41,126 కోట్లుగా ఉంది. వడ్డీ ఆదాయం 5.8 శాతం పెరిగి రూ. 1,17,996 కోట్లకు చేరింది. గత ఏడాది రూ. 1,11,526 కోట్ల వడ్డీ ఆదాయం చోటు చేసుకుంది. గడిచిన క్యూ1 లో ఇతర ఆదాయం 55.4 శాతం గణనీయంగా పెరిగి రూ. 17,345 కోట్లకు చేరింది. గత ఏడాది ఇది రూ. 11,162 కోట్లుగా ఉంది. స్థూల నిరర్థక ఆస్తుల 1.83 శాతంగా, నికర నిరర్థకఆస్తులు 0.47 శాతంగా ఉన్నాయి. రుణాల జారీ 11.8 శాతం పెరిగి రూ. 41.91 లక్షల కోట్లకు, డిపాజిట్లు 8.7 శాతం పెరిగి రూ. 53.28 లక్షల కోట్లకు చేరాయి.

## సిరాజ్‌కు షాకిచ్చిన సచిన్.. 'బాల్ ఆఫ్ ది సిరీస్' ఘనుడు ఎవరంటే..!


అందరన్స్ టెండూల్కర్ ట్రోఫీలో నిప్పులు చెరిగిన మహ్మద్ సిరాజ్ మాజీ ఆటగాడు సచిన్ టెండూల్కర్ షాకిచ్చాడు. మియా భాయ్‌కు తగిన గుర్తింపు రాలేదని అభిప్రాయపడిన సచిన్.. భారత జట్టు చరిత్రాత్మక విజయంలో కీలక పాత్ర పోషించిన అతడిని కాదని ఆకాశ్ దీప్ ను ఎంచుకున్నాడు. ఐదు టెస్టుల సిరీస్‌లో 'బాల్ ఆఫ్ ది సిరీస్' గా ఆకాశ్‌కే ఓటేశాడు మాస్టర్ బ్లాస్టర్. జో రూట్‌ను బౌల్డ్ చేసిన బంతినే మాస్టర్ బ్లాస్టర్ బాల్ ఆఫ్ ది సిరీస్ అని చెప్పాడు. అలా అని సిరాజ్‌ను ప్రతిభను తాను తక్కువ చేయడం లేదని సచిన్ తాజాగా ఒక వీడియోలో వెల్లడించాడు.బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టులో గిల్ సేన సూపర్ విక్టరీతో సిరీస్ సమం చేసింది. ఆ మ్యాచ్‌లో ఆకాశ్ దీప్ క్రీజులో పాతుకుపోయిన జో రూట్‌ను అద్భుతమైన బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆకాశ్ సంధించిన ఆ బంతినే సచిన్ బాల్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపిక చేశాడు. 'నా దృష్టిలో జో రూట్‌ను బౌల్డ్ చేసిన ఆకాశ్ దీప్ బంతి అద్భుతం. అతడి వికెట్ తీయడం మ్యాచ్ ఫలితాన్నే మార్చేసింది. ఆకాశ్




విసిరిన బంతిని కాస్త ఆలస్యంగా ఆడాడు రూట్. భీకర ఫామ్‌తో పాటు టన్నుల కొద్దీ పరుగులు బాదిన రూట్‌ను ఔట్ చేయడం ద్వారా భారత జట్టు విజయావకాశాలు పెరిగాయి. అందుకే.. ఆ బంతిని బాల్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంచుకున్నా' అని సచిన్ వివరించాడు.ఓవల్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో 'మ్యాచ్ విన్నర్'గా నిలిచిన సిరాజ్‌ను ఆకాశానికెత్తేశాడు. 'ఐదు టెస్టుల సిరీస్‌లో సిరాజ్ ప్రదర్శన నమ్మశక్యం అనిపించలేదు. చాలా గొప్పగా బౌలింగ్ చేశాడు. అతడి ఆటిట్యూడ్ నాకెంతో నచ్చింది. అతడి పాదాలలో ఉన్న లయ, వేగం చాలా నచ్చాయి. నిలకడగా లైన్ అండ్ లెంగ్త్‌తో ఆఖరి రోజు సిరాజ్ సూపర్ స్పెల్ వేశాడు. సిరీస్‌లో అప్పటికే 1,000కి పైగా బంతులు వేసిన అతడు.. ఐదో రోజు కూడా గంటకు 145 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేశాడని కామెంటేటర్లు చెప్పగా విన్నాను. అతడి ధైర్యం, జట్టును గెలిపించాలనే అతడి కసి అద్భుతం.జట్టుకు అవసరమైన ప్రతిసారి సిరాజ్ నేనున్నానంటూ ముందుకొస్తాడు. కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ కెప్టెన్ బౌలర్ అనిపించుకుంటాడు. గతంలో చేసినట్టే ఈ సిరీస్‌లోనూ ఈ పేస్ గన్ తన సత్తా చాటాడు. సిరీస్‌లో అతడు తీసిన వికెట్లే అందుకు నిదర్శనం. ఎంతో ప్రతిభ ఉన్నా సరే సిరాజ్‌కు మాత్రం తగినంత గుర్తింపు రాలేదు అని టెండూల్కర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

## లండన్‌లో ఐపీఎల్ కోచ్‌తో.. 'వన్డేలకు సై' అంటున్న కోహ్లీ

భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ మళ్లీ బ్యాట్ అందుకున్నాడు. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కు తొలి ట్రోఫీ అందించిన విరాట్.. ఇక టీమిండియా జెర్సీలో చెలరేగిపోయేందుకు సిద్ధమవుతున్నాడు. టీ20లకు.. ఈమధ్యే టెస్టులకు వీడ్కోలు పలికిన కింగ్ పరిమిత ఓవర్ల ఫార్మాట్ కోసం ప్రాక్టీస్ మొదలెట్టాడు. లండన్‌లో ఉంటున్న అతడు.. అక్కడే ఐపీఎల్ కోచ్‌తో కలిసి బ్యాటింగ్ సాధనకు ఉపక్రమించాడు. శుక్రవారం కోహ్లీ కోచ్‌తో దిగిన ఫొటో పెట్టాడు.తన ఆటతో కోట్లాదిమందిని అభిమానులుగా మార్చుకున్న కోహ్లీ మళ్లీ మైదానంలోకి దిగేందుకు ఎదురుచూస్తున్నాడు. వన్డే స్క్వాడ్‌లో చోటు సంపాదించాలనే లక్ష్యంతో ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ కు అసిస్టెంట్ కోచ్‌గా పనిచేస్తున్న నయీం అమిన్ సాయం తీసుకుంటున్నాడు కోహ్లీ. నెరిసిన





గడ్డం, బూడిద రంగు టీషర్ట్, బ్లూ షార్ట్‌తో విరాట్.. నవ్వులూ చిందిస్తూ దిగిన ఫొటోను అభిమానులతో పంచుకున్నాడు. బ్యాటింగ్ సలహాలు ఇస్తున్నందుకు బ్రదర్ నీకు ధన్యవాదాలు. నిన్ను కలవడం ఎల్లప్పుడూ గొప్పగా ఉంటుంది' అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో రాసుకొచ్చాడీ రన్ మెషీన్. లండన్‌లోనే నెట్స్ ప్రాక్టీస్ షురూ చేసిన విరాట్.. నయీం పర్యవేక్షణలో మునపటి లయను అందుకునేందుకు కఠోర సాధన చేయనున్నాడు.

**ఐపీఎల్ ట్రోఫీ గెలిచిన వేళ జట్టు సభ్యులతో కోహ్లీ సంబురం**

ఐపీఎల్ 18వ సీజన్‌తో తన ట్రోఫీ కలను సాకారం చేసుకున్న విరాట్ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ తనకెంతో ఇష్టమైన టెస్టులకు గుడ్ బై చెప్పాడు. ఇంగ్లండ్ పర్యటనకు ముందే రిటైర్మెంట్ బాంబ్ పేల్చిన అతడు.. వన్డేల్లో తళుక్కుమనేందుకు కాచుకొని ఉన్నాడు. అక్టోబర్‌లో భారత జట్టు మూడు వన్డేల సిరీస్ కోసం ఆస్ట్రేలియా పర్యటన కు వెళ్లనుంది. అక్టోబర్ 19 నుంచి 25 వరకూ జరుగబోయే ఈ సిరీస్‌పై కన్నేసిన కోహ్లీ ఫామ్ చాటుకునేందుకు తహ తహ లాడుతున్నాడు.

# స్పోర్ట్స్

## ఐదింటిలో ఒక్కటే భేష్.. ఆ నాలుగు అంతంత మాత్రమేనట..!



ఈమధ్యే ముగిసిన అండరన్స్ - టెండూల్కర్ ట్రోఫీలో వికెట్ బ్యాటర్లకే అనుకూలించడం గమనించాం. 'బజ్ బాల్' ఆటకు తగ్గట్టు బ్యాటర్లకు ఉపకరించే పిచ్‌లు రూపొందించడం చూసి క్యూరేటర్స్‌పై మండిపడ్డారు మాజీ ఆటగాళ్లు. తాజాగా అంతర్జాతీయ క్రికెట్ మండలి సైతం ఐదు టెస్టులు జరిగిన పిచ్‌లకు రేటింగ్స్ ఇచ్చింది. ఇందులో ఒకే ఒకటి బాగుందని తెలిపింది. భారత్, ఇంగ్లండ్ జట్లు తొలి టెస్టు ఆడిన లీడ్స్ వికెట్ మాత్రమే 'చాలా బెస్ట్' అని ఐసీసీ వెల్లడించింది. మిగతా నాలుగు పిచ్‌లు పర్లేదని రేటింగ్స్ ఇచ్చింది.అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీకి వేదికైన ఐదు పిచ్‌లకు శుక్రవారం ఐసీసీ రేటింగ్స్ ప్రకటించింది. లీడ్స్‌లోని హెడింగ్లేలో జరిగిన తొలి టెస్టు వికెట్ చాలా బాగుందని, ఔట్ ఫీల్డ్ కూడా చక్కగా ఉందని ఐసీసీ తెలిపింది. బర్మింగ్‌హమ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ పిచ్ సంతృప్తికరంగానే ఉందని, ఔట్‌ఫీల్డ్ చాలా బెటర్‌గా ఉందని చెప్పింది. లార్డ్స్ పిచ్ సంతృప్తికరంగానే ఉందని చెప్పిన ఐసీసీ ఔట్‌ఫీల్డ్‌కు 'వెరీ గుడ్' రేటింగ్ ఇచ్చింది. మాంచెస్టర్ పిచ్‌కు కూడా పర్లేదని.. ఔట్‌ఫీల్డ్ కూడా బాగుందని తెలిపింది ఐసీసీ. చివరిదైన ఓవల్ వికెట్‌కు మాత్రం ఐసీసీ ఇంకా రేటింగ్స్ ఇవ్వాల్సి ఉంది.

**ఆరు నుంచి నాలుగుకు**

ఐసీసీ 2023 వరకూ పిచ్‌లకు ఆరు విధాల రేటింగ్స్ ఇచ్చేది. 'చాలా బాగుంది', 'బాగుంది', 'సాధారణం', 'సాధారణం కంటే తక్కువ', 'అధ్వానం', 'అసలెంత మాత్రం పనికిరాదు'.. అని రేటింగ్స్ ఇస్తూ ఉండేది. అయితే.. రెండేళ్ల నుంచి 'చాలా బాగుంది', 'సంతృప్తికరంగా ఉంది', 'సంతృప్తికరంగా లేదు', 'ఆటకు పనికి రాదు' అని నాలుగు రకాల రేటింగ్స్‌ను ప్రకటిస్తోంది.

**2-2తో సిరీస్ సమం**

బ్యాటింగ్ ఫ్రెండ్లీ పిచ్‌లు రూపొందించడం ఇంగ్లండ్ బోర్డుకు పరిపాటి. భారత జట్టును కూడా ఇలానే దెబ్బతీయాలనుకున్నారు ఇంగ్లండ్ క్యూరేటర్లు. చివరిదైన ఓవల్ టెస్టుకు మాత్రం పచ్చికతో కూడిన బౌన్సీ పిచ్ రూపొందించారు. కానీ, శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టీమిండియా సంచలన ఆటతో సిరీస్ సమం చేసింది. ఇంగ్లీష్ ఆటగాళ్లకు దీటుగా ఆడుతూ భారత క్రికెటర్లు సైతం శతకాల మోత మోగించారు.నిర్ణయాత్మక ఓవల్ టెస్టులో సిరాజ్ తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు, రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీసి చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. దాంతో, తొలిసారి ఇరుదేశాల దిగ్గజాల పేరుతో నిర్వహించిన అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీని 2-2తో సిరీస్ పంచుకున్నాయి భారత్, ఇంగ్లండ్.




## బెల్లంకొండ 'కిష్కిందపురి' నుంచి తొలి పాట విడుదల

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'కిష్కిందపురి' . ఈ సినిమాకు కౌశిక్ పెగళ్ళపాటి దర్శకత్వం వహిస్తుండగా.. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు. ఉండిపోవే నాతోనే అంటూ సాగే ఈ పాటను జావేద్ అలీ పాడగా.. పూర్ణ చారి లిరిక్స్ అందించారు. చైతన్ భరద్వాజ్ సంగీతం అందించాడు.

## చిల్ మూడ్‌లో రష్మిక..

### విరుపులతో కుర్రాళ్లను ఆగం చేస్తున్న బ్యూటీ!

అందాల ముద్దుగుమ్మ రష్మిక మందన గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఛలో సినిమాతో తెలుగు చిత్రపరిశ్రమలోకి అడుగు పెట్టిన ఈ చిన్నది, ఈ మూవీలో తన నటనతో మంచి ఫేమ్ సంపాదించుకుని, తర్వాత వరస సినిమాలతో ఫుల్ బిజీ అయిపోయింది. ముఖ్యంగా ఛలో సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకొని, గీతా గోవిందం సినిమాతో మంచి యూత్‌లో క్రేజ్ సంపాదించుకుంది. ఈ మూవీ తర్వాత ఈ అమ్మడును అవకాశాలు వరించాయి. వరసగా స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్ కొట్టేసింది. ముఖ్యంగా పుష్ప సినిమాతో పాన్ ఇండియా లెవల్?లో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. పుష్ప, పుష్ప 2, యానిమల్, ఛావా ఇలా ఈ అమ్మడు చేసిన సినిమాలన్నీ బ్లాక్ బస్టర్ హిట్స్ అవ్వడంతో లక్కీ హీరోయిన్‌గా మారిపోయింది. ఇక ఈ మధ్య రిలీజైన సికిందర్ ఫ్లాప్ అయినప్పటికీ ఈ అమ్మడు క్రేజ్ మాత్రం ఏ మాత్రం దగ్గలేదు. ప్రస్తుతం ఈ చిన్నది రష్మిక ది గర్లఫ్రెండ్, రెయిన్బోది సినిమాల్లో నటిస్తుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది తన క్యూట్ క్యూట్ ఫొటోస్ షేర్ చేస్తూ.. కుర్రకారు మనసు దోచేస్తుంది. ఈ క్రమంలోనే ఈ బ్యూటీ తాజాగా తన సోషల్ మీడియా అకౌంట్‌లో బ్లాక్ అండ వైట్ డ్రెస్‌లో ఉన్న పలు ఫొటోలు షేర్ చేసింది. అందులో రష్మిక చాలా క్యూట్ గా కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ పిక్స్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.



## ధనుష్‌తో మృణాల్ ప్రేమాయణం?

దక్షిణాది అగ్రనటుడు ధనుష్‌తో మృణాల్ ఠాకూర్ ప్రేమలో ఉందనే వార్తలు ప్రస్తుతం ముంబయి సినీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. వీరిద్దరి డేటింగ్‌పై ఆంగ్ల మీడియాలో కథనాలొస్తున్నాయి. ఈ జంట ప్రేమబంధానికి కొద్ది మాసాల క్రితమే బీజం పడిందని అంటున్నారు. ఇటీవల జరిగిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ధనుష్ అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మృణాల్‌తో చనువుగా ఉన్న వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. కొన్ని నెలల క్రితం చెన్నైలో జరిగిన ఓ సినిమా ఈవెంట్‌లో ధనుష్, మృణాల్ మధ్య తొలిసారి పరిచయం ఏర్పడిందని, అక్కడే వీరి ప్రేమప్రయాణానికి తొలి అడుగులు పడ్డాయని అంటున్నారు. ధనుష్ సోదరీమణులు కార్తీక, విమల గీత ఇన్‌స్టాగ్రామ్‌లో మృణాల్ ఠాకూర్‌ను ఫాలో కావడంతో డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూరినట్లయింది. ధనుష్ తన కుటుంబ సభ్యులకు మృణాల్ ఠాకూర్‌ను పరిచయం చేశారని అంగ్ల మీడియాలో వార్తలొచ్చాయి. తమ ప్రేమబంధంపై ప్రస్తుతం ఈ జంట గోప్యతను పాటిస్తున్నారని, సరైన సమయంలో అందరికి తెలియపరిచే ఆలోచనలో ఉన్నారని సమాచారం. గత కొద్దిరోజులుగా మీడియాలో వస్తున్న డేటింగ్ వార్తలపై ఈ తారలిద్దరూ ఇప్పటివరకూ స్పందించలేదు. దాంతో డేటింగ్ రూమర్స్ నిజమేనని అభిమానులు భావిస్తున్నారు.



## 2028కి కూడా పుష్ప3 రావడం కష్టమే.. కారణం ఏంటంటే..!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, లెక్కల మాస్టారు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం పుష్ప. తొలి పార్ట్ 2021లో రిలీజైంది. ఏ మాత్రం అంచనాలు లేకుండా రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లు రాబట్టింది. ఇందులోని పాటలు, డైలాగులు, యాక్షన్ సీక్వెన్స్ లు పాన్ వరల్డ్ రేంజ్ లో ఫేమస్ కావడంతో పుష్ప2 చిత్రానికి క్రేజ్ పెరిగింది. ఇక ఈ మూవీ గత ఏడాది విడుదలై ఇండియన్ సినిమా బాక్సాఫీస్ రికార్డులు కొల్లగొట్టింది. ఏకంగా రూ. 1800 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఇక పుష్ప 2 సినిమా ఎండింగ్ లో పుష్ప 3 కూడా ఉంటుందని చిన్న హింట్ ఇచ్చారు మేకర్స్. 2028లో పుష్ప 3 సినిమాను విడుదల చేస్తామని రాబిన్ హుడ్ ప్రమోషన్లలో భాగంగా మైత్రి మూవీస్ నిర్మాత రవిశంకర్ చెప్పుకొచ్చారు.అయితే బన్నీ, సుకుమార్ బిజీ షెడ్యూల్ చూస్తే పుష్ప 3 చిత్రం 2028కి రావడం డౌటే అనిపిస్తుంది. అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీతో సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా పూర్తి కావాలంటే ఎలా లేదన్నా రెండేళ్లు పైన పడుతుంది. అట్లీ సినిమా పూర్తయ్యాక బన్నీ.. త్రివిక్రమ్‌తో ఓ ప్రాజెక్ట్ చేయనున్నాడు. ఈ చిత్రం చేస్తే పుష్ప 3 అనుకున్న టైమ్‌కి రావడం కష్టం. అట్లీ సినిమానే దాదాపు 2027 దాకా చేసేలా కనిపిస్తుంది. ఇక త్రివిక్రమ్ చిత్రం ఎంత లేదన్న ఏడాదిన్నర సమయం తీసుకుంటుంది. మరి పుష్ప 3 ఎప్పుడు సెట్స్ మీదకు వెళుతుంది, ఎప్పుడు పూర్తై థియేటర్స్‌లోకి వస్తుంది. చూస్తుంటే 2028 లో పుష్ప 3 సాధ్యం కాదు సరికదా అసలు అప్పటికి సెట్స్ మీదకు వెళ్లడం గొప్పే అంటున్నారు.అయితే పుష్ప2 భారీ విజయం సాధించిన నేపథ్యంలో పుష్ప 3 కోసం అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పుష్ప రాజ్ మేనియాని మరోసారి తెర మీద చూసేందుకు ఫ్యాన్స్ ఉవ్విళ్లూరుతున్నారు. కాని బన్నీ కమిటైన సినిమాలని బట్టి చూస్తుంటే 2028లో పుష్ప3 రావడం కష్టమే అని తెలుస్తుంది. ఇక సుకుమార్ పుష్ప2 తర్వాత ఏ ప్రాజెక్ట్ స్టార్ట్ చేయలేదు. రామ్ చరణ్‌తో తన తదుపరి మూవీ చేయనున్నట్టు తెలుస్తుంది. ప్రస్తుతం చరణ్.. సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు దర్శకత్వంలో పెద్ది చేస్తున్నాడు. ఇది పూర్తయ్యాక సుకుమార్- రామ్ చరణ్ కాంబో ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది.

## వార్ 2' ప్రమోషన్

### ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకున్న హృతిక్ రోషన్, ఎన్టీఆర్.!




బాలీవుడ్ అగ్ర నటుడు హృతిక్ రోషన్, టాలీవుడ్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ కలిసి నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'వార్ 2ః . ఈ చిత్రం మరో వారం రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఇండిపెండెన్స్ డే కానుకగా ఈ చిత్రం ఆగష్టు 14న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ క్రమంలోనే వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు ఈ స్టార్ హీరోలు. అయితే తాజాగా ఈ నటులు ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకున్నారు. జూనియర్ ఎన్టీఆర్ 'వార్ 2' సినిమాలో తన పోస్టర్‌తో ఉన్న ఒక భారీ బిల్ బోర్డ్‌ను హృతిక్ రోషన్ ఇంటికి పంపించి సవాళు "ఘుంగ్రూ టూట్ జాయేంగే పర్ హమ్‌సే యే వార్ జీత్ నహీ పావోగే" (గుంఘ్రూలు పగిలిపోవచ్చు, కానీ ఈ యుద్ధాన్ని మీరు మాతో గెలవలేరు) అంటూ హృతిక్‌ని సవాలు చేశాడు. దీనికి హృతిక్ సమాధానమిస్తూ.. జూనియర్ ఎన్టీఆర్ ఇంటికి హృతిక్ పోస్టర్ ఉన్న ఒక బిల్ బోర్డ్‌ను పంపారు. ఈ బిల్ బోర్డ్‌లో మీరు 'నాటు నాటు' డాన్స్ ఎంత చేసినా, ఈ యుద్ధంలో గెలిచేది మాత్రం నేనే అంటూ హృతిక్ బదులిచ్చాడు. దీనికి ఎన్టీఆర్ బదులిస్తూ.. నైస్ రిటర్న్ గిఫ్ట్ హృతిక్ సర్ అంటూ సరదాగా సమాధానమిచ్చాడు. ఈ ఇద్దరు స్టార్ హీరోల మధ్య జరుగుతున్న ఈ సరదా సంభాషణ 'వార్ 2' చిత్రంపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది.

Printed,Published by,Owened by **GADDAM NAGARAJU &** Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad **RNI. NO TELTEL/2022/83463 &** Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
**EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com**